

వెంకటాచలం : కసుమూరులో చిన్న గంధాన్ని ఊరేగింపుగా తీసుకువస్తున్న దర్గా ముజావర్లు

ముగిసిన సంబరం


కసుమూరు, ఏఎస్‌పేటకు తరలివచ్చిన భక్తులు

- వివరాలు 6లో..

ఆంధ్రజ్యోతి

5

ANDHRAJYOTHY



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

ఆదివారం 21 సెప్టెంబరు 2025

మతిమరుపు ముంచేస్తుంది!

జిల్లాలో 90వేల మందికిపైగా వ్యాధిగ్రస్థులు

- వివరాలు 8లో..

జేసీగా మొగిలి వెంకటేశ్వర్లు

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా జాయింట్ కలెక్టర్‌గా మొగిలి వెంకటేశ్వర్లును నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడున్న కొల్లాబత్తుల కార్తీక్ బదిలీ చేసి, ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. కాగా, వెంకటేశ్వర్లు 2014లో బుచ్చిరెడ్డిపాళెం తహసీల్దారుగా విధులు నిర్వహించారు.

తలకొక సిమ్..

• రీఛార్జి కోసం ఏటా రూ.590 కోట్ల వ్యయం

రూ.కోట్లలో సొమ్ము!

రాము ఆఫీస్ సిమ్‌తోపాటు వ్యక్తిగత సిమ్ ఒకటి వాడు తున్నారు. ఈయన భార్య ఒక సిమ్. బీటెక్ చదువుతున్న కుమారుడు రెండు సిమ్‌లు, సీనియర్ ఇంటర్ చదువుతున్న కుమార్తె ఒక సిమ్ వాడుతోంది. అంటే ఈ ఒక్క కుటుంబంలోనే ఐదు సిమ్‌లను (ఆఫీస్ సిమ్ మినహాయిస్తే) వినియోగిస్తున్నారు. ఒక సిమ్‌కు 28 రోజులకుగాను సరాసరిన రూ.300 రీచార్జి చేసినా రూ.1500 అవుతుంది. అంటే ఏడాదికి సుమారు రూ.20వేల వరకు రాము కుటుంబం సిమ్ రీచార్జీలకే ఖర్చు చేస్తోంది.





• జిల్లా జనాభా 29.64 లక్షలు.. సిమ్‌ల సంఖ్య 22.47 లక్షలు

• సామాన్యుడి పాలిట తూటాలా మారిన డేటా!

జిల్లా జనాభా 29.64 లక్షలు. వీరిలో ఆరేళ్ల వయసులోపు ఉన్నవారు 3.04 లక్షల మంది. ఆ తర్వాత ఆరేళ్ల పైబడినవారి సంఖ్య 26లక్షల 60వేలు. జిల్లాలో వినియోగంలో ఉన్న సిమ్ కార్డులు 22.47 లక్షలు. అంటే ఆరేళ్ల పైబడిన జనాభాలో 85 శాతం మంది సిమ్ కార్డులు కలిగి ఉన్నారన్నమాట. అంటే దాదాపుగా ఊహతెలిసిన ప్రతి ఒక్కరి వద్ద ఒక్కో సిమ్ము కార్డు యాక్టివేషన్‌లో ఉందన్నమాట. అంటే ప్రతి నెల వాటికి రీచార్జి చేస్తున్నారు. బీఎస్ఎన్ఎల్ అధికారుల సమాచారం మేరకు ఆ సంస్థకు చెందిన సిమ్ కనెక్షన్లు 2.36 లక్షలు. మొత్తం అన్ని కంపెనీల సిమ్‌కార్డుల్లో బీఎస్ఎన్ఎల్ వాటా 10.50 శాతంగా అధికారులు తెలిపారు. బీఎస్ఎన్ఎల్ కనెక్షన్లు 2.36 లక్షలు ఉంటే ఇంతకన్నా ఎక్కువ నెట్‌వర్క్ కలిగిన ఎయిర్‌టెల్, జియో తదితర కంపెనీల కనెక్షన్లు అన్నింటిని లెక్కకడితే జిల్లాలో 22,47,619 కనెక్షన్లు ఉన్నాయి.

• రీచార్జి ఖర్చు రూ.కోట్లలోనే..

ప్రస్తుతం డేటా ప్యాకేజీ లేని రీచార్జి దాదాపుగా ఏ కంపెనీలోనూ లేదు. అంతా డేటా మయమే. రోజుకు 1.5, 2.0, 3.0, 5.0 జీబీ డేటా ప్యాకేజీలే. ప్రస్తుతం దాదాపుగా ఉన్నవన్నీ స్మార్ట్‌ఫోన్లే కాబట్టి వినియోగదారులు కూడా డేటా ప్యాకేజీని చూసే రిచార్జ్ చేసుకొంటున్నారు. ప్రస్తుతం ఒక ప్రధాన కంపెనీ 28 రోజులకు 2జీబీ డేటా ప్యాకేజీతో అన్ లిమిటెడ్ కాల్స్ సౌకర్యం కల్పిస్తోంది. 28 రోజుల కాలానికి రీచార్జి ఖరీదు రూ.199 రూపాయలు. జిల్లాలోని వినియోగదారలంతా ఈ తక్కువ ప్యాకేజీనే వాడుతున్నారని లెక్కగట్టినా నెలకు రూ.45.40 కోట్లు. ఏడాదికి (13 రీచార్జిలు) రూ.590.22 కోట్లు. కానీ ఎక్కువ శాతం మంది రోజుకు 1.5 జీబీ డేటా ప్యాకేజీనే తీసుకొంటున్నారు. దీని ఖరీదు నెలకు 299 రూపాయలు. ఈ మొత్తంతో లెక్కిస్తే ఏడాది రీచార్జి వ్యయం సుమారు రూ.850 కోట్ల వరకు ఉంటుంది.

• తాగడానికి, వాగడానికి భారీ వ్యయం

జిల్లా ప్రజలు ఏడాది కాలంలో ఎక్కువ ఖర్చు చేసే నిరర్థక ఆదాయ అవసరాల్లో మందు, మొబైల్ రీచార్జీల గురించే ప్రధానంగా చెప్పుకోవాలి. కానీ వీటికే జిల్లా ప్రజలు ఏటా సుమారు రూ.2500 కోట్లు ఖర్చు చేస్తున్నారు. జిల్లాలో మందుబాబులు రోజుకు సగటున 4కోట్ల రూపాయలకు తాగుతున్నారు. అంటే ఏడాదికి రూ.1700 కోట్లు మందు కోసం ఖర్చు పెడుతున్నారు. ఇది కొంతలో కొంత నయం. ఎందుకంటే ప్రభుత్వాలు నడవాలన్నా, సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా మద్యం ఆదాయమే దిక్కు. ఈ క్రమంలో మందు కోసం చేసిన ఖర్చులో కొంతైనా తిరిగి పథకాల రూపంలో, అభివృద్ధి పనుల రూపంలో తిరిగి వస్తుంది. కానీ మొబైల్ రీచార్జీలకు చేసే వ్యయం గురించే ప్రజలు ఆలోచించాలి. రోజుకు సగటున 1.5 కోట్ల రూపాయలు రీచార్జిల కోసం ఖర్చు చేస్తున్నారు. ఏడాదికి రూ.600 నుంచి 850 కోట్ల వరకు వ్యయం చేస్తున్నారు.



ఆదివారం ప్రత్యేకం

సమాచార విప్లవం వెల్లివిరుస్తోంది. ఎంతలా అంటే జిల్లా జనాభా ఎంతమంది ఉంటే అన్ని సిమ్ కార్డులు వినియోగించే స్థాయిలో పెరిగిపోతోంది. మొబైల్ నెట్ కనెక్షన్‌లో ప్రజలు ఏం చూస్తున్నారు.. ఏ మేరకు ప్రయోజనం పొందుతున్నారు అనే మాటను పక్కనపెడితే సిమ్ కంపెనీలు మాత్రం బాగానే లాభపడుతున్నాయి. రీచార్జి పేరిట జిల్లావాసుల కష్టార్జితంలో ఏటా రూ.590 కోట్లకుపైగానే వసూలు చేసుకొంటున్నాయి. ఇది కనిష్ఠంగా వేసుకున్న లెక్క అత్యధిక శాతం మంది నెలకు రూ.299 ప్యాకేజీనే వాడుతున్నారు. ఈ ప్యాకేజీతో లెక్కగడితే జిల్లా సెల్‌ఫోన్ వినియోగదారుల రీచార్జి ఖర్చు మరో రూ.250 కోట్లు పెరుగుతుంది. అంటే ఏడాదికి మొబైల్ ఫోన్ల రీచార్జి కోసం చేస్తున్న ఖర్చు సరాసరి రూ.850 కోట్లు అన్నమాట.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

డీసీఎంఎస్ మాజీ చైర్మన్

వీరి చలపతి అరెస్ట్

2023లో టీడీపీ నేత ఇల్లు ధ్వంసంపై కేసు నమోదు

వైసీపీలో కలకలం

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావును పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. టీడీపీలో క్రియాశీలకంగా ఉన్నారని, పంచాయతీ ఎన్నికల్లో ఎవరూ నిలబడక పోయినా జిల్లా ఉపాధ్యక్షుడిగా కరకటి మల్లికార్జున ముందుకు సాగుతున్న సమయంలో 2023 ఏప్రిల్ 22న ఆయన ఇల్లు, వాటర్ ప్లాంట్‌ను వీరి చలపతి ధ్వంసం చేశారని, ఆయనపై హత్యాయత్నం చేశారనే ఆరోపణల నేపథ్యంలో నెల్లూరు రూరల్ పోలీసులు చలపతిని అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన్ను నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయానికి తరలించి విచారించారు. ఇప్పటికే వీరి చలపతిపై కొడవలూరు, విడవలూరు, కోవూరు పోలీసు స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో పోలీసులు అరెస్టు చేస్తారనే భయంతో నెలల తరబడి చలపతి పరారీలో ఉన్నారు. అయితే ఈనెల 19న ఓ కేసులో ముందస్తు బెయిల్ రావడంతో ఆయన నెల్లూరుకి చేరుకున్నారు. శనివారం రాజుపాలెంలో ఓ సమావేశం నిర్వహించి, పెద్ద సంఖ్యలో కార్యకర్తలను సమీకరించారు.ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సైతం హాజరయ్యారు. కాగా ఆదివారం నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయానికి భారీ సంఖ్యలో జనసందోహంతో వెళ్లి బెయిల్ పత్రాలు అందించి రావాలని కార్యకర్తలకు చలపతి సూచించారు. అనంతరం అక్కడ నుంచి మాజీ ఎమ్మెల్యే ప్రసన్నతో కలిసి ఆయన ఇంటికి వెళ్లారు. అక్కడ నుంచి తిరిగి వస్తుండగా పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకొని నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. అయితే చలపతి అరెస్ట్ అయ్యారన్న విషయం తెలుసుకున్న కోవూరు నియోజకవర్గ వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయానికి తరలివస్తారని పోలీసులు భావించి, భారీ బందోబస్తు ఏర్పాటు ఏర్పాటు చేశారు.

అందరి లక్ష్యం గ్రీన్ ఏపీ కావాలి

• స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో కలెక్టర్ శుక్లా



నాటిన మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరురూరల్, సెప్టెంబరు 20, (ఆంధ్రజ్యోతి) : పర్యావరణాన్ని కాపాడేందుకు పచ్చదనం పెరగాల్సిన అవసరం ఉందని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీవీనగర్ లోని పార్కులో జేసీ కార్తీక్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అందరి లక్ష్యం గ్రీన్ ఏపీ కావాలని కలెక్టర్ పిలుపుని చ్చారు. గడిచిన 8 నెలలుగా స్వర్ణాంధ్ర, స్వ చ్ఛాంధ్ర కార్యక్రమాలు విజయవంతంగా జరు గుతున్నాయ ని వెల్లడించారు. నవంబరులో వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున ఇప్పుడే మొక్కలు నాటితే అప్పటికి బాగా పెరుగుతా యని తెలిపారు. ప్రతీ ఒక్కరు విధిగా ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, డీసీ చెన్నుడు, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



దగదర్తి విమానాశ్రయ భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు, కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు

వచ్చే ఏడాది ఏప్రిల్‌కు రామాయపట్నం పోర్టు పూర్తి

• ఈలోపు పనులు వేగవంతం చేయండి

• అధికారులకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు ఆదేశం

గుడ్లూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులను, మరింత వేగవంతంగా పూర్తిచేసే దిశగా అడుగులు వేయాలని రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ టి. కృష్ణబాబు అధికారులను ఆదేశించారు. శనివారం పోర్టు నిర్మాణాన్ని ఆయన పరిశీలించి, మాట్లాడారు. ఇప్పటికే 71 శాతం పనులు పూర్తయ్యాయని, పరిస్థితులు అనుకూలిస్తే వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పనుల పూర్తికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. పోర్టు నిర్మాణంతో పాటు అనుబంధ పరిశ్రమల ఏర్పాటులో చేవూరు గ్రామం కొత్తపారిశ్రామిక విప్లవానికి సాక్ష్యంగా మారుతుందన్నారు. చేవూరులో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు వేగవంతంగా భూసేకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ హబ్‌లో బీపీసీఎల్ వంటి ప్రధాన పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. వేలాది ఉద్యోగాలు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అనంతరం పోర్టు, అనుబంధ పరిశ్రమల ఏర్పాట్లకు సంబంధించిన భూమి రికార్డు మ్యాప్‌లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్‌కలెక్టర్ హిమవంశీ, గుడ్లూరు తహసీల్దారు విజయ భాస్కర్, పోర్టు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


రెండేళ్లలో విమానాశ్రయం

దగదర్తి మండలం దామవరంలో గతంలో సీఎం చంద్రబాబు ఆవిష్కరించిన శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆయన పరిశీలించి, తహసీల్దారు కృష్ణ ద్వారా వివరాలు సేకరించారు. పీపీపీ విధానంలో ఈ విమానాశ్రయం నిర్మించనున్నారని, నవంబరు లోపు దరఖాస్తులు దరఖాస్తుల ప్రక్రియ ముగుస్తాయని తెలిపారు. డిసెంబరు నాటికి తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. 2 సంవత్సరాల్లో విమానాశ్ర యం పూర్తి అవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.

• ఫిషింగ్‌హార్బర్‌లో త్వరలో ఎగుమతులు

బిట్రగుంట : బోగోలు మండలం జువ్వలదిన్నెలోని ఫిషింగ్ హార్బర్‌ను స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు శనివారం పరిశీలించారు. ఆయన వెంట కలెక్టర్ హిమాన్షు శుక్లా, కావలి ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి, ఆర్డీవో వంశీకృష్ణ తదితరులు ఉన్నారు. పనుల ప్రగతిని అర్చించిన అనంతరం కృష్ణబాబు మత్స్యకారులతో మాట్లాడారు. త్వరలో ఫిషింగ్ హార్బర్‌లో ఎగుమతులు దిగుమతలు జరిగేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

కాహనమా.. ఇప్పుడు వద్దులే!




వాహనాల కొనుగోలుపై పండుగలు, ఇతర సందర్భాలు లేకున్నా ఆఫర్లు మాత్రం అంబరాన్ని అంటుతున్నాయి. అయినా వాహనాలు కొనుగోలుకు మాత్రం ప్రజలు ముందుకు రావడం లేదు. అడ్వాన్సు, డౌన్‌పేమెంట్ కూడా అవసరం లేదు. ఫైనాన్స్‌లో వాహనాన్ని తీసుకెళ్లండి అంటున్నా ససేమీరా అంటున్నారు. ఇందుకు కారణం కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం, ఒక్కటైతే దసరా ఆఫర్లు మరో కారణం. నాలుగు శ్లాబులుగా ఉన్న జీఎస్టీ రేట్లను రెండు శ్లాబులకు తగ్గించేలా కేంద్ర ఆర్థిక శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 22వ తేదీన నూతనవిధానం అమల్లోకి వస్తుంది. ప్రతిపాదనల ప్రకారం ప్రసుత్తం 5, 12, 18, 28 శ్లాబులు ఉండగా, ఇకపై 5, 18 శ్లాబులు మాత్రమే ఉంటాయి. కేంద్రం నిర్ణయంతో వాహన ధరలు భారీగా తగ్గనున్నాయి. సుమారు రూ.50 వేల నుంచి 2 లక్షల వరకు తగ్గే అవకాశాలు ఉన్నాయి. అంతేగాక దసరా సందర్భంగా వివిధ కంపెనీలు ఆఫర్లు కూడా ప్రకటిస్తాయి. వీటన్నిటి దృష్ట్యా ప్రస్తుతం వాహనాల కొనుగోలు ప్రజలు ఆసక్తి చూపడం లేదు.

- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)

పెరిగి.. తగ్గి.. పెరిగిన వరద

• 'సోమశిల'కు 37,212 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

• మూడు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల




అనంతసాగరం సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో పెరిగింది. శుక్రవారం 25,449 క్యూసెక్కులు వస్తుండగా శనివారం ఉదయం 6 గంటకు 37,212 క్యూసెక్కులు నమోదవగా 11 గంటలకు 22,524 క్యూసెక్కులకు తగ్గింది. దీంతో డ్యాంలో నీటి నిల్వ 73.378 టీఎంసీలుగా నమోదైంది. దిగువ డెల్టాకు 5, 6, 7 గేట్లు ఎత్తి 27,750, ఉత్తర కాలువకు 400, కండలేరుకు వరద కాలువ ద్వారా 10,450 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

• ఆదినిమ్మాయపల్లి గేజ వద్ద పెరిగిన వరద

కడప జిల్లా ఆదినిమ్మాయపల్లి వద్ద పెన్నానదికి వరద పెరుగుతోంది. పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఉపనదుల నుంచి పెన్నాలోకి వరద చేరుతున్నట్లు అధికారులు గుర్తించారు. 50 నుంచి 60 వేల క్యూసెక్కులు నమోదవుతున్నట్లు వారు వెల్లడించగా ఈ ప్రవాహం ఆదివారం ఉదయం నాటికి సోమశిలకు చేరవచ్చని అంచనా వేస్తున్నారు. దీంతో ముందుస్తుగా దిగువకు వదులుతున్న నీటి ప్రవాహాన్ని 40 వేల క్యూసెక్కులకు పెంచారు. ఈ మేరకు తీరగ్రామాల ప్రజల అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు జయవర్దన్ పిలుపునిచ్చారు.

• 'సంగం' నుంచి నీటి విడుదల

సంగం, (ఆంధ్రజ్యోతి): సంగం బ్యారేజ్ వద్ద నీటి ప్రవాహం తగ్గి శనివారం మళ్లీ పెరిగింది. బ్యారేజ్ వద్ద ఉదయం 4 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండగా, నీటిమట్టం 10 అడుగులు ఉన్నది. అయితే శుక్రవారం సోమశిల నుంచి అంచెలంచెలుగా నీటి విడుదలను 26 వేల క్యూసెక్కులకు పెంచారు. ఈ నీరు సంగం బ్యారేజ్‌కి చేరడంతో క్రమేణా నీటి ప్రవాహం పెరిగింది. దీంతో వచ్చిన నీరు వచ్చినట్టే బ్యారేజీలో 26 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. దిగువన నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



సంగం బ్యారేజ్ దిగువకు వెళ్తున్న నీటి ప్రవాహం

అసెంబ్లీకి వెళ్లక జగన్ దాగుడు మూతలు

వెంకటాచలం, సెప్టెంబరు 20 (ఆంధ్ర జ్యోతి) : అసెంబ్లీకి వెళ్లలేక వైఎస్ జగన్‌రెడ్డి దాగుడుమూతల ఆటలు ఆడుతున్నారని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమ న్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు ఆరో పించారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నాడు అధికారమదంతో తమ అధినేత పవన్ కళ్యాణ్‌ను అసెంబ్లీ గేటు తాకని వ్వమని చెప్పిన జగన్‌రెడ్డి నేడు జగన్నాటకాలు ప్రదర్శిస్తు న్నారని విమర్శిం చారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ భూస్థాపితం కావడం ఖాయమన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10588
వెండి కిలో ధర	రూ. 135100
వెండి ఒక గ్రాము	రూ. 138.10

తూముకు చెక్కలేక పాట్లు



తూము వద్ద చెక్కలేకపోవడంతో రేకులు పెడుతున్న యువకులు

మనుబోలు, సెప్టెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): సాగునీరు పారే తూము వద్ద చెక్క లేకపోవడంతో నీటిని అదుపు చేయడానికి రైతులు నానా పాట్లు పడుతున్నారు. మనుబోలు దళితవాడ పక్కనే పొలాలకు వెళ్లే తూము ఉంది. దానికి పడమరగా ఏటికి వెళ్ళే మరో తూము ఉంది. చెరువునీరు ఎక్కువైనప్పుడు కలుజుల గుండా ఇక్కడకు నీరు పారుతుంది. అయితే పంటలు వేయనప్పుడు గూడా పొలాలకు వెళ్ళే తూము గుండా నీళ్ళు వెళ్ళి పంటపొలాలు తడిచిపోతున్నాయి. ఇక్కడ నీటిని అదుపు చేసేందుకు రేకులు, బస్తాలు వేసి అదుపు చేసుకునే పరిస్థితి. అయినప్పటికీ నీరుపారుదల ఆగడం లేదు. వర్షాకాలంలోనూ నీళ్లు ఎక్కువైనప్పుడు తూము వద్ద చెక్కలేక పెద్ద సమస్యగా మారుతోంది. కావున నీటి పారుదల అధికారులు స్పందించి చెక్క ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

కసుమూరు దర్గాలో న్యాయాధికారి పూజలు



దర్గాలో నెల్లూరు న్యాయాధికారి షేక్ నిషాద్ నాజ్ పూజలు

వెంకటాచలం, సెప్టెంబరు 20 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలీ 248వ గంధమహోత్సవం సందర్భంగా దర్గాను శనివారం నెల్లూరు అడిషనల్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి షేక్ నిషాద్ నాజ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దర్గా ముజావర్లు ఆమెకు ఘన స్వాగతం పలికారు. దర్గాలో ఆయన పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా ఏఎంసీ చైర్మన్ పుట్టిన రోజు వేడుకలు



ఏఎంసీ చైర్మన్‌కు కేక్ తినిపిస్తున్న టీడీపీ నాయకులు

మనుబోలు, సెప్టెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): సర్వేపల్లి ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి 65వ పుట్టినరోజు వేడుకలను శనివారం మనుబోలులో ఘనంగా నిర్వహించారు. పలువురు టీడీపీ, జనసేన నాయకులు ఆయనకు శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేక్ కట్‌చేసి పలువురికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ సాని వెంకటరమణయ్య, నాయకులు వెందోటి భాస్కర్ రెడ్డి, రాజాగౌడ్, జనసేన మండలాధ్యక్షుడు పెనుబాక ప్రసాద్, నాయకులు జాకీర్, పెనుబాక మహేష్ పాల్గొన్నారు.

ఆరుతడి పంటలపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్తలు

మనుబోలు, సెప్టెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): రైతులు ఎడగారులో భూమిని ఖాళీగా ఉంచకుండా ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలని నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు కోరారు. మనుబోలు రైతు సేవా కేంద్రం-1లో రైతులకు వరిసాగులో యాజమాన్య పద్ధతులు, ఆరుతడి పంటలపై అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్ర వేత్తలు డా. కే కిరణ్‌కుమార్‌రెడ్డి, డా. ఎస్ లోకేష్ బాబులు తెగుళ్ళ నివారణ, యూరియాతో పాటు పశువుల, పచ్చిరొట్ట, జీవన ఎరువులు వాడుకునే విధానం గురించి తెలియ జేశారు. కొత్త వరి ఓఎంసీ 103 గురించి అవగాహన కల్పించారు. ఎడగారులో ఆరుతడి పంటలైన పెసలు, సజ్జ, అలసంద పంటల గురించి వివరించారు. ఈ కార్యక్ర మంలో నీటిసంఘం అధ్యక్షుడు పచ్చిపాల రామిరెడ్డి, రాష్ట్ర రైతు కార్యదర్శి రాయపాటి కిరణ్ కుమార్, వీఏఏలు శివ, దివ్య పాల్గొన్నారు.

ఈ సారైనా..'విజయ'ం దక్కేనా?

- పాల సేకరణలో జిల్లాలో 4వ స్థానం
- పదేళ్ళుగా చిల్లింగ్ సెంటర్ నిర్వహణ
- 2014లో టాప్-1 అవార్డు కైవసం
- డైరెక్టర్ పదవి కోసం ఎదురుచూపు
- రోజుకు 550 లీటర్ల పాలు సరఫరా



మనుబోలు విజయడెయిరీలో పాలు పోస్తున్న రైతులు

మనుబోలు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పాలసేకరణ కేంద్రాన్ని రైతులు 'పాలబూత్' అంటారు. కానీ ఒక్క విజయడెయిరీని మాత్రమే 'గవర్నమెంట్ బూత్' అంటుంటారు. సమాజంలో ప్రైవేట్ పాలకేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా.. విజయ డెయిరీ బ్రాండ్ మాత్రం రైతుల మదిలో స్వచ్ఛమైన 'విజయ' పాలధారలా నిలిచిపోయింది. 40 ఏళ్లుగా అన్నదాతలకున్న అపారమైన నమ్మకం ఇది. మనుబోలు పాడి రైతులు ప్రభుత్వానికి అనుబంధంగా ఉన్న విజయ డెయిరీలో పాలుపోస్తూ, వచ్చే ఆదాయంతో పిల్లలను చదివించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. విజయ డెయిరీ పరిధిలో జిల్లాలో 95 పాల సొసైటీలు నడుస్తున్నాయి. వీటిలో పాలసేకరణలో మనుబోలు సొసైటీది 4వ స్థానం. అంతేగాకుండా మనుబోలు నుంచి నడిపే చిల్లింగ్ సెంటర్ నుంచి 2వేల లీటర్ల పాలు ఇక్కడి నుంచి నెల్లూరు విజయడెయిరీ ప్రధాన కేంద్రానికి సరఫరా అవుతున్నాయి. ఇంతటి చరిష్మా ఉన్న మనుబోలు సొసైటీకి జిల్లా డెయిరీలో ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నది ఇక్కడి పాడి రైతుల ఆవేదన. గత 25 ఏళ్ళుగా ఒక్క డైరెక్టర్ పదవి కూడా మనుబోలు సొసైటీకి దక్కలేదు. ప్రతీసారి విజయడెయిరీలో ఎన్నికల కోలాహలం మొదలైనప్పుడల్లా ఈసారైనా 'విజయ'ం దక్కుతుందా? అన్న ఆశతో రైతులు ఎదురుచూస్తుంటారు.

రోజుకు 550 లీటర్ల పాలు...

పాలసేకరణలో ఏడాది క్రితం 11వ స్థానంలో ఉన్న మనుబోలు సొసైటీ ప్రస్తుతం 4వ స్థానానికి చేరుకోవడం ఆశావహ పరిణామం. ఏడాది క్రితమే మనుబోలు సొసైటీ పాలకవర్గంలో మార్పులు జరిగాయి. ఈ క్రమంలో పాడిరైతులు ఎక్కువమంది పాలు పోసేందుకు ముందుకు వచ్చారు. ప్రతీ ఏటా పాల డబ్బులకు అదనంగా దసరా కానుకగా బోనస్ ఇస్తుంటారు. అంతేగాకుండా సబ్సిడీ కింద మేత, పశువుల ఆరోగ్యం సంరక్షణకు మందులు పంపిణీ చేస్తుంటారు. దీంతో మనుబోలులో 70 మందికి పైగా రైతులు రోజుకు 550 లీటర్ల పాలను ఈ డెయిరీకి తీసుకువస్తున్నారు. ఒక్క మనుబోలు కాకుండా, పరిసర గ్రామాలైన పిడూరు, యాచవరం, పురిటిపాళెం గ్రామాల నుంచి పాలు పోస్తున్నారు.

'ఉత్తమ' అవార్డు కైవసం

పాలసేకరణలో మనుబోలు సొసైటీ జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు దక్కించుకుంది. 2014లో జిల్లాలోని అన్ని సొసైటీల కంటే మనుబోలు సొసైటీ పాలసేక రణలో ప్రథ మ స్థానంలో ఉండేది. దీంతో డెయిరీ జిల్లా చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి అప్పటి మనుబోలు సొసైటీ ప్రెసిడెంట్ కొళ్ళపూడి శ్రీనువాసులురెడ్డికి అవార్డు అందించారు.

పదేళ్ళుగా చిల్లింగ్ సెంటర్ నిర్వహణ

చిన్న చిన్న గ్రామాల్లో ఉన్న సొసైటీల నుంచి వచ్చే పాలను జిల్లా డెయిరీకి చేర్చాలంటే రవాణాభారం ఎక్కువయ్యేది. దీంతో జిల్లా డెయిరీ పాలకవర్గం చిల్లింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జిల్లా డెయిరీ ఆదేశాలతో మనుబోలు సొసైటీ సొంత స్థలాన్ని చిల్లింగ్ సెంటర్‌కు కేటాయించింది. అప్పటి నుంచి మనుబోలు చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా, తిరుపతి జిల్లాలోని విందూరు, గిద్దలూరు, మిట్టాత్మకూరు గ్రామాల నుంచి వచ్చే పాలను ఇక్కడి చిల్లింగ్ సెంటర్‌కు తీసుకువస్తారు. ఇక్కడ కూలింగ్ చేసి 2 వేల లీటర్ల పాలను మనుబోలు సొసైటీనుంచి ట్యాంకర్ ద్వారా నెల్లూరు డెయిరీకి తరలిస్తుంటారు.

విజయడెయిరీ.. ఓ నమ్మకం



మాది పురిటిపాళెం. 7 కి.మీ నుంచి రోజూ మనుబోలుకు వచ్చి 40 లీటర్ల పాలు పోస్తున్నా. మూడేళ్ళుగా ఇక్కడికి వస్తున్నా. బోనస్‌లు, ఠంచన్‌గా పదిహేను రోజుల కొక సారి డబ్బు ఇస్తున్నారు. ఈ కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేయాలి.

- రొండా వెంకటసుబ్బయ్య, పాడి రైతు

పాతికేళ్లుగా డైరెక్టర్ పదవి ఇవ్వలేదు



25 ఏళ్ళుగా మండలంలో ఏ సొసైటీకి డైరెక్టర్ పదవి దక్కలేదు. జిల్లా కేంద్రం లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నాం. పాల సేకరణ వేగవంతం, చిల్లింగ్ సెంటర్ నిర్వహణ, సరఫరాలో అంతరాయం కలగకుండా చేరవేస్తున్నాం. ఎక్కువ పాలు మా సొసైటీ నుంచే పం పిస్తున్నాం. జిల్లా డెయిరీ అధికారులు, పాలక వర్గం డైరెక్టర్ పదవి ఇస్తే మరింత నాణ్యమైన సేవలు అందిస్తాం.

- పచ్చిపాల శ్రీకాంత్ రెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్

రేపటి నుంచి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు



జొన్నవాడ ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): భక్తుల కోర్కెలు తీర్చే కరుణామయి జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలో ఈనెల 22 నుంచి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలను విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. ఇప్పటికే భక్త జనం నవరాత్రులకు ముందే దీక్షలు చేపట్టారు. ఉదయం, సాయంత్రం ఆలయంలో ప్రదక్షిణలు చేస్తూ స్వామి, అమ్మవారి సేవలో తరిస్తున్నారు.

కలశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభం

జొన్నవాడలోని శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో ఈనెల 22వ తేదీ సోమవారం రాత్రి కలశస్థాపనతో శరన్నవరాత్రి మహోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభం కానున్నాయి. 23వ తేదీ మంగళవారం త్రిపురాంబిక అలంకారం, 24న రక్తబీజవధ అలంకారం, 25న మధుకైటభ వధ అలంకారం, 26న రాజరాజేశ్వరి అలంకారం, 27న భండాసురవధ అలంకారం, 28న మహాలక్ష్మి అలంకారం, 29న సరస్వతి అలంకారం, 30న (దుర్గాష్టమి రోజు) దుర్గ అలంకారం, అక్టోబరు 1న మహర్నవమి రోజు మహిషాసురమర్దని అలంకారం, 2వ తేదీన విజయదశమి, శమీపూజ, అశ్వవాహనం గ్రామోత్సవం అనంతరం ఏకాంతసేవతో నవరాత్రి వేడుకలు ముగియనున్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు ఆలయ ఈఓ ఏవీ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఉచిత ప్రసాదంతో పాటు నిత్యాన్నదాన సదనంలో భక్తులకు భోజన వసతి, శుద్ధిజలాలు, ఉచిత వైద్య శిబిరం మొదలైన ఏర్పాట్లు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ముగిసిన 'గంధం' సంబరం

- కసుమూరు, ఏఎస్‌పేటకు తరలివచ్చిన భక్తులు



స్వామి వారి జపమాల ప్రదర్శిస్తున్న దర్గా ఈవో మహమ్మద్ హుసేన్

వెంకటాచలం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలి గంధమహోత్సవం సందర్భంగా చివరి రోజు శనివారం చిన్న గంధం (తహలీల్ ఫాతేహ) అత్యంత వైభవంగా జరిగింది. స్థానిక చందన్ మహల్ (బంగళా) నుంచి మంగళ వాయిద్యాలు, ఫకీర్ల జర్రబ్ (విన్యాసాలు), డీజే, తప్పెట్లు, కీల గుర్రాల మధ్య గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చారు. కడప పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేని ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత మస్తాన్ స్వామి వారి సమాధికి గంధం లేపాన్ని పూశారు. దర్గా ముజావర్లకు గంధం బిందెను అందజేశారు. తెలుగు రాష్ట్రాల నుంచేగాక తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరావడంతో కసుమూరు కిక్కిరిసిపోయింది. భక్తులకు గంధాన్ని పంచిపెట్టారు. సీఐ సుబ్బారావు, ఎస్‌ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

● **ఏఎస్‌పేట :** శ్రీ హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గా గంధ మహోత్సవంలో భాగంగా చివరి రోజు శనివారం భక్తి శ్రద్ధలతో తహలీల్ ఫాతేహ నిర్వహించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఖురాన్ పఠనం చేసి భక్తులకు వివరించారు. ఫకీర్ల కీర్తనలు ఆకట్టుకున్నాయి. నాయబ్ రసూల్ స్వామి స్వయంగా ఉపయోగించిన జపమాలను దర్గా ఈవో మహమ్మద్ హుసేన్ ప్రదర్శించారు.

కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

ముత్తుకూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేలటూరులోని ఏపీ జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రం మెయిన్‌గేట్ దగ్గర కాంట్రాక్ట్ కార్మికులందరూ పాల్గొని ఆందోళన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ గోడా భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ రంగంలో పనిచేస్తున్న 23,500 మంది కాంట్రాక్ట్ కార్మికులను చేయాలని, 2022 పీఆర్‌సీ బకాయిలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించచిన కార్మికుడికి నష్టపరిహారం చెల్లించి వారి కుటుంబంలో ఉద్యోగం ఒకరికి ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి తెలంగాణా తరహాలో కార్మికులందరికీ న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు చీకిరి ఆదిశేషయ్య, గౌరవ అధ్యక్షులు స్వర్ణ రమణరావు, నాయకులు కస్తూరి నాగరాజు, గంగిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బద్వేలి వెంకటేశ్వర్లు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణం



తిరుచ్చి ఉత్సవంలో పెంచలస్వామి

రాపూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో శ్రీవారి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి, అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిత్య కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి భక్తజనుల నడుమ కల్యాణ మహోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్‌సేవ వైభవంగా జరిపారు. అలాగే భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ నిర్వహించినట్లు ఆలయ ఉప కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

రాళ్లపాడు ప్రాజెక్టు నీటిమట్టం 9 అడుగులు

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం 9 అడుగులకు చేరింది. వర్షాలకు ముందు 6.9 అడుగుల మేర నీటిమట్టం ఉండేది. మంచినీటి పథకాలకు ప్రతిరోజూ 7 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతున్నట్లు డీఈఈ వేంకటేశ్వర్లు చెప్పారు.

ఊరూరా.. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర



చెత్త తొలగిస్తున్న స్వచ్ఛంధ్ర సంస్థ ప్రతినిధులు

ఇందుకూరుపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు మండల తహసీల్దారు కార్యాలయంలో సేవా పక్షోత్సవాలలో భాగంగా శనివారం మండల బీజేపీ అధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో 'స్వచ్ఛ భారత్' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపా వంశీధర్‌రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. పరిసరాలను శుభ్రం చేశారు. ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు సేవా పక్షోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. జయభారత్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించారు. గంగపట్నం గ్రామానికి చెందిన 50 మంది యువకులు భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు దువ్వూరు శ్రీనివాసులు, జిల్లా పక్వాడ్ రావూరు అశోక్, జిల్లా కార్యదర్శి నాగమని, మండల పక్వాడ్ల శివప్రసాద్, శ్రీనివాసులు, వెంకట్రావు, శరత్, రమేష్‌రెడ్డి, సునీల్, అహ్మద్, సీహెచ్ గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని మునులపూడి పంచాయతీ బట్టిపాటిదిన్నె గ్రామంలోని ఎంపీపీపీ పాఠశాలలో స్థానిక బీజేపీ నాయకులతో కలిసి బీజేపీ రూరల్ అధ్యక్షుడు సిద్దన మనోహర్‌రెడ్డి స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పరిసరాలను శుభ్రం చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ చేశా రు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయ కులు గండి రఘురామయ్య, మండల ప్రధాన కార్యదర్శులు కృష్ణారెడ్డి, మస్తాన య్య, సతీష్, వెంకటేశ్వర్లు రెడ్డి పెంచల ప్రసద్, తదితరులు పాల్గొన్నారు.

విడవలూరు: రామతీర్థం సముద్ర తీరంలో ఇంటర్నేషనల్ బీచ్ క్లీనప్ డే సందర్భంగా శనివారం 'మన బీచ్- మన శుభ్రత' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్ కుమారి మాట్లాడుతూ ప్రతీ రెండవ శనివారం మండల పరిధిలోని ఓ గ్రామంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాల న్నారు. పర్యాటకులు పడేసిన చెత్త కాగితాల్ని, ప్లాస్టిక్ కవర్లను సముద్రతీరం నుంచి తొలగించి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను అభినందిం చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్, ప్రజాసేవ సంస్థ ప్రతినిధి కొందూరు బాబు, స్వామి నాథన్ సంస్థ, ట్రీ ఫౌండేషన్, సాగరమిత్ర సంస్థ ప్రతినిధులు, పంచాయతీ రాజ్, రెవెన్యూ, వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

మనుబోలు: పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పంచాయతీలు పరిశుభ్రంగా ఉంటాయని సర్వేపల్లి ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి అన్నారు. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం మనుబోలు పంచాయతీ కార్యాలయంలో 14మంది పారిశుధ్య కార్మికులను సత్కరించారు. ఎంపీడీవో జలజాక్షి ఎంపీపీ వజ్రమ్మ, ఎంపీటీసీ రాజేశ్వరి, సర్పంచు పద్మమ్మ, టీడీపీ, జనసేన మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, పెనుబాక ప్రసాద్, కార్యదర్శి గరుడయ్య, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

CRIME NEWS

లాడ్జిలో పేకాట

- బెట్టింగ్ డాన్ కృష్ణసింగ్‌తో పాటు 13 మంది అరెస్ట్



పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసిన చిన్నబజారు పోలీసులు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ లాడ్జిలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట కేంద్రంపై చిన్నబజారు పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బెట్టింగ్ డాన్ కృష్ణసింగ్ ఉండటంతో పోలీసులు ఆశ్చర్యానికి గురయ్యారు. పోలీసుల వివరాల మేరకు.. పొగతోట ప్రాంతంలోని పీఎస్‌కే లాడ్జిలో పేకాట నిర్వహిస్తున్నారని పక్కా సమాచారం అందుకున్న చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు తమ సిబ్బందితో కలిసి శనివారం దాడులు చేశారు. ఈ దాడుల్లో 14 మందిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించి విచారించారు. కిసాన్ నగర్‌కు చెందిన పెంచలయ్య పేకాట కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. బెట్టింగ్ డాన్ కృష్ణసింగ్‌తో పాటు మరో 12 మంది పేకాట ఆడుతున్నారని, వారి వద్ద నుంచి రూ.2,20,110 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఫోన్ చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆత్మకూరు బస్టాండులో ప్రయాణికుడు జేబులో నుంచి వన్‌ప్లస్ ఫోన్‌ను అపహరించిన కేసులో నిందితుడుని నవాబుపేట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వివరాలను నవాబుపేట ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 19వ తేది ఆత్మకూరు బస్టాండులో ఉన్న సురేంద్రబాబు జేబులో నుంచి వన్‌ప్లస్ మొబైల్‌ను గుర్తుతెలియని వ్యక్తి దొంగలించాడు. బాధితుడు నవాబుపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వెంటనే స్పందించిన ఇన్‌స్పెక్టర్ సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని శనివారం గుర్తించారు. అనకాపల్లి పట్టణంకు చెందిన గంట ఈశ్వరరావు ఫోన్‌ను దొంగలించినట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడు వద్ద నుంచి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మోటార్‌బైక్ చోరీ

ఉదయగిరి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో మోటార్‌బైక్ చోరీకి గురైన సంఘటన శనివారం తెల్లవారుజామున చోటుచేసుకొంది. వివరాల మేరకు.. కాలనీకి చెందిన పిడుగు నాగార్జున తన ఇంటి ముందు హీరోహోండా బైక్‌ను పార్కింగ్ చేశాడు. ఉదయం చూసేసరికి బైక్ కనిపించలేదు. తన నివాసంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ఫుటేజీలో చోరీ ఘటన నమోదై ఉంది. ఈ విషయమై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ఉదయగిరి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లాయపల్లి గ్రామానికి చెందిన ఐశ్వర్య అనే యువతి ఈనెల 13వ తేదీ నుంచి కనిపించడంలేదని అన్న పెనుగొండ రామాంజనేయులు శనివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.


ముగిసిన దస్తావేజు లేఖర్ల సమ్మె



రిజిస్ట్రార్ బాలాంజనేయులకు వినతిపత్రం అందచేసిన డాక్యుమెంటు రైటర్లు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : దస్తావేజుల రిజిస్ట్రేషన్ సాఫ్ట్‌వేర్‌లో లోపాలను సవరించాలని దస్తావేజు లేఖర్లు చేస్తున్న పెన్‌డౌన్ సమ్మె శనివారం ముగిసింది. జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులును దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం నాయకులు కలిసి డిమాండ్లు పరిష్కరించాలని వినతిపత్రం అందచేశారు. ఈ విషయాన్ని రిజిస్ట్రేషన్-స్టాంపుల శాఖ ఐజీ దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. దీంతో నాయకులు తాత్కాలికంగా సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం జిల్లా దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సోమవారం నుంచి యథావిధిగా కార్యకలాపాలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు. కాగా ఈ సమ్మెలో సిటీ దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేబీవీ అశోక్, నాయకులు పంచాగ్నుల పవన్‌కుమార్, ఎండీ జమీరుద్దీన్, ములుమూడి బాలసుబ్రహ్మణ్యం, ఎండీ మజహరుద్దీన్, ములుమూడి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో తప్పిదాలను సరిచేయాలని రైతుల ధర్నా



తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతులు

ఉదయగిరి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో చోటుచేసుకున్న తప్పిదాలను సరిచేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహసీ ల్దారు కార్యాలయం ఎదుట రైతులు ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం నాయ కులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ రీసర్వేలో జరిగిన తప్పిదాలతో జాయింట్ ఎల్‌పీఎంలు నమోదై రైతులు పడరాని పాట్లు పడుతున్నారన్నారు. 1బీ, అడం గల్ రాక, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేక, బ్యాంకుల్లో రుణాలు ఇవ్వక రైతులు పొలాలను బీడు భూములుగా వదిలేశారన్నారు. తప్పిదాలను స రిచేయాలని కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రీసర్వేలో తప్పిదాలను సరి చేయాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ విజమయ్య, రైతులు పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు క్లస్టర్ సముదాయ సమావేశాలను సద్వినియోగం చేసుకుని బోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎంఈవో-2 టీ శ్రీనివాసులు సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న క్లస్టర్ సముదాయ సమావేశాలను పరిశీలించి తగు సూచనలు సలహాలు అందజేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	138
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	272

కోడిగుడ్ల ధర (100): 560

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా రంగారావు



నెల్లూరు(లీగల్), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సీనియర్ న్యాయవాది వేలూరు రంగారావును నియమిస్తూ ఎన్ఎంసీ కమిషనర్ నందన్ శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈయన ఈ పదవిలో మూడేళ్లపాటు కొనసాగుతారు. రంగారావును స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులవడం ఇది మూడవ సారి. ఆయన మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా అందిస్తున్న సేవలను గుర్తించి మళ్లీ నియమించడం పట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఈయన రెండు దఫాలు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కూడా సేవలు అందించారు. తన నియమాకానికి కృషి చేసిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి రంగారావు కృతజ్ఞతలు తెలిపారు.

న్యూస్ బాక్స్

పెన్నా ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● నెల్లూరు ఆర్డీవో అనూష

నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : పెన్నా నదిలో నీటి విడుదల జరిగిన నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు ఆర్డీవో అనూష హెచ్చరించారు. ఎగువన వర్షాలు కురుస్తుండడంతో సోమశిల జలాశయం నుంచి నీటిని విడుదల చేసినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల జలాశయం నుంచి దాదాపు 30 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని పేర్కొన్నారు. దీంతో పెన్నానదిలోకి ఎవ్వరూ చేపల వేటకు, మునిగేందుకు వెళ్లరాదని హెచ్చరించారు. ముఖ్యంగా యువత ఈత కోసం పెన్నా పరిసర ప్రాంతాలకు వెళ్లరాదని తెలిపారు.

డీఎల్‌డీవో కార్యాలయ పనుల పరిశీలన

నెల్లూరు(జడ్పీ), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు డీఎల్‌డీవో కార్యాలయ పనులను శనివారం జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలను పరిశీలించి నిర్దీత సమయంలోగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మిడతల మహాలక్ష్మికి అభినందనలు

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి దేవస్థాన పాలక మండలి సభ్యురాలుగా ఎన్నికైన మిడతల రమేష్ (బీజేపీ) ధర్మపత్ని మిడతల మహాలక్ష్మికి శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా పద్మశాలి సంఘం ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బుధవారపు బాలాజీ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సోమా గోపాల్, పొదలకూరు మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు చొప్పా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి చింతగింజల సుబ్రహ్మణ్యం తదితరులు ఆమెను అభినందించారు.

సివిల్ ఇంజనీరింగ్‌లో కిరణ్‌కుమార్‌కి డాక్టరేట్

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నెల్లూరుకు చెందిన నున్నా లక్ష్మీనరసింహ కిరణ్‌కుమార్ సివిల్ ఇంజనీరింగ్‌లో డాక్టరేట్ సాధించారు. ఎస్వీ యూనివర్శిటీ సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ ఐవీ.రమణారెడ్డి పర్యవేక్షణలో స్ట్రెంగ్త్ అండర్ డ్యూరేబులిటీ ప్రాపర్టీస్ ఆఫ్ ఫ్లైయాష్ బేస్డ్ సెల్ఫ్ కంపాక్టింగ్ జియోపాలిమర్ కాంక్రీట్ విత్ ది అడిషన్ ఆఫ్ నానో సిలికా అనే అంశంపై పరిశోధన చేసి పత్రాలను సమర్పించడంతో ఆయనకు యూనివర్శిటీ అధికారులు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సహచర సిబ్బంది, అధ్యాపకులు ఆయనను అభినందించారు.

ఏపీజీబీ పెన్షనర్ల అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్‌గా నరేంద్రరెడ్డి



నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర చీఫ్ అడ్వైజర్‌గా నెల్లూరు అన్నమయ్య సర్కిల్ ప్రాంతానికి చెందిన బి. నరేంద్రరెడ్డిని ఎన్నుకున్నారు. గుంటూరులో శుక్రవారం రాత్రి జరిగిన ఆ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నరేంద్రరెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ఏపీజీబీలో విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు పనిచేస్తానని చెప్పారు.

ఘనంగా మాస శివరాత్రి

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని పొగతోట ఆదిశంకరా ధ్యాన మందిరంలో శనివారం మాసశివరాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శివపంచాయతీన దేవతలకు అభిషేక అర్చనలు, శంకర భగవత్పాదులకు పుష్పార్చనలు జరిగాయి. సాలి గ్రామాలకు కమిటీ అధ్యక్షుడు రామసుబ్రహ్మణ్యశర్మ, పవని అనిల్‌కుమార్‌లు మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో చక్రాలవారి ట్రస్ట్ ఎండీ ఆనంద్‌కుమార్, సమయానంద స్వామి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు న్యాయవాదులు విధుల బహిష్కరణ

నెల్లూరు(లీగల్), సెప్టెంబర్ 20(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు ఈనెల 22వ తేదీన కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీ.అయ్యప్ప రెడ్డి, నక్కల నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మరిణించిన న్యాయవాదులకు నివాళులర్పించే కార్యక్రమం ఉదయం 10-30 గంటల నుంచి సాయంత్రం 4-15 గంటలకు మార్చడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

గ్రీన్ ఆంధ్రప్రదేశ్ అందరి బాధ్యత

● నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



చీపురు పట్టి పరిసరాలను శుభ్రపరుస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(జడ్పీ), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఆంధ్రప్రదేశ్ మనందరి బాధ్యత అని, అందుకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం జీవితంలో భాగం కావాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నగరంలోని నుడా కార్యాలయంలో శనివారం స్వచ్ఛ ఆంధ్రా - స్వర్ణ ఆంధ్రా కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను శుభ్రపరిచి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ గ్రీన్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు పిలుపును ఆదర్శంగా తీసుకుని తానూ ఐ లవ్ నెల్లూరు నినాదాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ వాహనాల వెనుక, దుకాణాల ముందు ఐ లవ్ నెల్లూరు బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నుడా సెక్రటరీ అల్లంపాటి పెంచలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ లక్ష్యం చేసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రీన్ ఏపీ కార్యక్రమంలో భాగంగా హరిత విస్తీర్ణం పెంచి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటం లక్ష్యంగా చేసుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం



మొక్క నాటుతున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, పక్కన జడ్పీ సీఈవో మోహనరావు



జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏఎస్పీ సౌజన్య

అరుణమ్మ పిలుపునిచ్చారు. నగరంలోని జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా గ్రీన్ ఏపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయంలో 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'

నెల్లూరు(క్రైం): నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సీహెచ్ సౌజన్య మాట్లాడుతూ ప్రతి నెల మూడవ శనివారం పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఆ ప్రాంతంలో మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చంద్ర మోహన్, ఎస్బీ సీఐ శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

నెల్లూరు(వైద్యం): మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ప్రజల ఆరోగ్యంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ వెల్లడించారు. శనివారం 16వ డివిజన్‌లో కార్పొరేటర్ వేనాటి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామిదాస్ స్కూల్ నుంచి బాల సుబ్రహ్మణ్యం పార్కు వరకు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన ఆమె కాలువలో మట్టిని తొలగించారు. అనంతరం పారిశుధ్య కార్మికు లకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో 16 డివిజన్ అధ్యక్షుడు వేనేటి సాయిరాం, డివిజన్ యూనిట్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కన్వీనర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో...



జీజీహెచ్‌లో మొక్క నాటుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి

నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం జరిగింది. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కొండేటి మాధవి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో ఆర్డినే టర్ శ్రీనివాసులు మొక్కలు నాటారు. పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మస్తాన్ బాషా, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి తదితరులు పాల్గొన్నారు.



కాలువలను శుభ్రం చేస్తున్న టీడీపీ నేత తాళ్లపాక అనురాధ

సత్యనారాయణంలో...

నగరంలోని 5వ డివిజన్ సత్యనారాయణ పురంలోని ఎస్వీఆర్ స్కూలు ప్రాంగణంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్ర మం జరిగింది. టీడీపీ నేత గంగాధర్ పరసరాలను శుభ్రం చేసి చెత్తను ఎత్తి వేశారు. ఈ సందర్భంగా కార్మికులతో చర్చించి ఏమైనా సమస్యలు ఉంటే మంత్రి నారాయణతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు బాల్‌రెడ్డి, సిద్దు సుబ్బారెడ్డి, దర్శి ప్రసాద్, రోశిరెడ్డి, శశికుమార్, రమణారెడ్డి, షేక్ అబీబ్, హేమంత్, వెంకటేష్ చౌదరి, షేక్ కరీముల్లా, ఖలీల్, ఖాదర్‌బాషా, రంగయ్య, ప్రసన్నరాజ్ అరవకుమార్ మస్తాన్, ఆసిఫ్, కృష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



చెత్తను ఎత్తి వేస్తున్న టీడీపీ నేతలు

స్వచ్ఛమైన పరిసరాలు ఉండాలి

నెల్లూరు(వెంకటేశ్వరపురం): స్వచ్ఛమైన ఆరోగ్యం కావా లంటే పరిసరాలు ఎల్లపుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని టీడీపీ నాయకుడు, స్థానిక క్లస్టర్ ఇంచార్జ్ జహీర్ పేర్కొన్నారు. స్వచ్ఛంధ్రా స్వర్ణాంధ్రా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పారిశుధ్య కార్మికులను సన్మానించారు. అనంతరం స్థానిక కాలువల్లో పూడికతీసి రోడ్లు ఊడ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జమీర్, షాహిద్, ఖాదర్‌బాషా, వాసు తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరపురంలో పారిశుధ్య కార్మికులతో కలసి రోడ్లు ఊడుస్తున్న టీడీపీ నాయకులు

భక్తులు, దాతల మనోభావాలకు ఇబ్బంది కలిగించొద్దు



రాజరాజేశ్వరి ఆలయంలో ఉత్సవ కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 20(ఆంధ్ర జ్యోతి): రాజరాజేశ్వరి ఆలయంలో ఈ నెలలో జరిగే దేవీనవరాత్రి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులు, ఆల య అభివృద్ధికి చేయూతనిచ్చే దాతల మనోభావాలకు భంగం కలగకుం డా ఉత్సవ కమిటీ సభ్యులు సేవలు అందించాలని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూచించారు. శనివారం ఆలయంలో జరిగిన ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ఏలూరు శిరీషా, వైస్‌చైర్మన్‌గా గూడంశెట్టి దొరబాబు, కార్యదర్శిగా బిరదవోలు చంటి, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి సత్కరించారు. ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 22 నుంచి అక్టోబరు 2వతేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా వీఐపీలకు మధ్యాహ్నం 12గంటల నుంచి 1గంటల వరకు, సాయంత్రం 5గంటల నుంచి 6గంటల వరకు దర్శనం కల్పిస్తున్నామన్నారు. దసరా ఉత్సవాలు 11 రోజులు అమ్మవారి అంతరాలయ ప్రదేశం నిలుపుదల చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, కార్పొరేటర్ చెక్కా అహల్య, ఉత్సవ కమిటీ సభ్యులు టీడీపీ నాయకులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి ఆశీస్సులతోనే అవకాశం

అమ్మవారి ఆశీస్సులతోనే ఆలయ ధర్మకర్తలుగా ఎంపిక కాగలరని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో నూతన పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయ ఈవో గిరికృష్ణ, ధర్మకర్తల మండలి అధ్యక్షుడుగా వటూరు సురేంద్ర యాదవ్, కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ధర్మకర్తలను ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించి అభినందించారు. ఆలయ చైర్మన్ ఒట్టూరు సురేంద్రయాదవ్ మాట్లాడుతూ తనకు రెండో సారి చైర్మన్ సేవలు చేసుకునేందుకు అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ కమిటీ సభ్యులను అభిమానులు, బంధువులు సత్కరించి అభినందనలు తెలిపారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ప్రముఖులు పాల్గొన్నారు.

బాలవెంగయ్య కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలి

● పరామర్శించిన సీపీఐ నేతలు



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సీపీఐ నేతలు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పెరమన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాల వెంగయ్య కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు దామా అంకయ్య డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని గుర్రాలమడుగు సంఘంలో మృతుల కుటుంబ సభ్యులను పార్టీ నేతలతో కలిసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా దామా అంకయ్య మాట్లాడుతూ ఈ ప్రమాదానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. అలాగే బాధిత కుటుంబాలకు ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయక కార్యదర్శి యామల మధు, సయ్యద్ సిరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు షాన్‌వాజ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్‌కిశోర్, గిరిజన సమాఖ్య నాయకులు శేఖర్, ముక్తియార్, సుబ్బరాయుడు, మోహన్ పాల్గొన్నారు.

మస్టర్లలో తేడాలొస్తే చర్యలు



మస్టర్ పరిశీలిస్తున్న ఎంపీడీవో

నెల్లూరురూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం నిర్వహణలో కూలీల లెక్కకట్టే మస్టర్లలో తేడాలొస్తే చర్యలు తప్పవని నెల్లూరు రూరల్ ఎంపీడీవో శైలేంద్రకుమార్ హెచ్చరించారు. శనివారం మండలంలోని సౌత్‌మోపూరులో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పని చేస్తున్న కూలీలు, మస్టర్‌ను పరిశీలించారు. అనంతరం స్థానిక సచివాలయాన్ని సందర్శించి ఉద్యోగుల హాజరు పరిశీలించారు. అనంతరం ములుముడి సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు.

అల్జీమర్స్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లావణ్య

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అల్జీమర్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎనెల్ ఆసుపత్రి న్యూరాలజిస్ట్ డాక్టర్ లావణ్య వెల్లడించారు. శనివారం ఎనెల్ ఆసుపత్రిలో అల్జీమర్స్ వ్యాధిపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ మన మెదడులో దాదాపు 100 బిలియన్ల నాడీ కణాలు, ఇతర కణ రకాలు ఉంటాయని చెప్పారు. ఫుడ్ అండ్ ఫార్మకోలాజికల్ అడ్మినిస్ట్రేషన్‌లో ప్రస్తుత అల్జీమర్స్ వ్యాధికి నాలుగు ఔషధాలు వినియోగంలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రోగులు పాల్గొన్నారు.

సీతాదేవి ఆలయంలో ముమ్మర ఏర్పాట్లు

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని బాలాజీనగర్ సీతారామ మందిరంలో 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరగనున్న దేవీ నవరాత్రి ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. సీతారామస్వామి మందిరం కమిటీ, వాకాటి నరసయ్య త్యాగరాజ కల్యాణ మండపం కమిటీల పర్యవేక్షణలో ఉత్సవాలు జరుగుతాయి.

నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలి

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టేలా ప్రోత్సహించాలని వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ సునీత అన్నారు. నగరంలోని సరస్వతినగర్ డాక్టర్ కిషోర్‌రత్నం ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ఎడ్యుకే టాక్స్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రత్నం విద్యాసంస్థల డైరెక్టర్‌లు డాక్టర్ కిషోర్, వాసంతిలు నూతన ఆలోచనలు చేస్తూ విద్యార్థుల ఉన్నతికి పాటుపడడం అభినందనీయమన్నారు. జీఎం రామ్మూర్తినాయుడు, ఏవోలు తుహీనా, సునీల్, అజయ్‌సింగ్, ప్రిన్సిపాళ్లు మణిమాల, జ్యోతి పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ



ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న పాలక మండలి సభ్యులు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 3వ వరకు జరిగే దేవీనవరాత్రి ఉత్సవాల కరపత్రాలను శనివారం పాలకమండలి సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ పాలక మండలి అధ్యక్షుడు కోటగురు బ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు షేగు షణ్ముఖరావులు మాట్లాడుతూ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా శ్రీసూక్త అభిషేకం, అష్టోత్తర సహస్ర నామార్చనలు, త్రిశతి, దేవీ ఖడ్గమాల, సప్తశతి పారాయణం, పూజలు జరుగుతాయని తెలిపారు. 22 నుంచి 3వతేదీ వరకు అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. 22న ఉదయం 6గంటలకు 1008 కలిశాలతో మహిళలు పెన్నానది నుంచి తీర్థంను తల్పగిరి రంగనాథస్వామి ఆలయం నుంచి ఊరేగింపు ఆలయానికి తీసుకువస్తారని తెలిపారు. ఈ ఊరేగింపులో పాల్గొన్న మహిళా భక్తులకు, వెండి కుబేర ప్రతిమను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి గౌరవ సలహాదారు మెట్టా ప్రసన్న ఆంజనేయులు, కార్యదర్శి ఎస్.చిరంజీవి, కోశాధికారి తొమ్మిన జనార్దనరావు, జాయింట్ సెక్రటరీ మునగా వెంకటేశ్వర్లు, తన్నీరు కిషోర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల వైఫల్యంపై వైసీపీలో ఆందోళన

● టీడీపీ వైద్య విభాగం జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ సిరాజ్



మాట్లాడుతున్న డాక్టర్ సిరాజ్

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో వైద్య కళాశాలల నిర్మాణాలలో వైఫల్యం చెందటంతో వైసీపీలో ఆందోళన మొదలైందని టీడీపీ వైద్య విభాగం జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ సిరాజ్ పేర్కొన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అందరికీ వైద్య విద్య అందించాలన్న ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలల నిర్మాణం వేగవంతం చేసేందుకు పీపీపీ పద్ధతికి శ్రీకారం చుట్టిందన్నారు. 17 వైద్య కళాశాలలు తెచ్చామని చెబుతున్న వైసీపీ నేతలు నిజంగా ఎన్ని కళాశాలలు నిర్మించింది, ఎంత ఖర్చు చేశారు అన్న వాస్తవాన్ని దాచిపెట్టి తప్పుడు ప్రచారం చేస్తుందని ఆరోపించారు. మార్కాపురం వైద్య కళాశాలను 17 శాతం పూర్తి చేశారని, మదనపల్లి 12 శాతం, ఆదోని 15 శాతం పూర్తి చేశారన్నారు. పులివెందులు వైద్య కళాశాలను పూర్తి చేయలేక పోయిందని ఎద్దేవా చేశారు.

తాగునీటి ట్యాంకుకు మరమ్మతులు


● వారం రోజులు ఉదయం 3, మధ్యాహ్నం 3 గంటలే నీటి సరఫరా



వాటర్ ట్యాంకు మరమ్మతులకు చేపట్టిన ఏర్పాట్లు

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటేశ్వరపురంలో ఓవర్ హెడ్ వాటర్‌ట్యాంకు మరమ్మతుల దృష్ట్యా ఆదివారం నుంచి వారం రోజుల పాటు తాగునీటి సరఫరాలో స్వల్ప మార్పులు చేస్తున్నట్లు వాటర్స్ వర్క్స్ డీఈ శరత్‌చంద్ర తెలిపారు. వెంకటేశ్వరపురం పార్కు వద్ద ఉన్న తాగునీటి ట్యాంకుకు 10 రోజులుగా మరమ్మతులు జరుగుతున్నాయి. అయినప్పటికీ ఎలాంటి అంతరాయం లేకుండా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఆదివారం నుంచి ట్యాంకు లోపలి భాగం మరమ్మతులు చేయనున్న దృష్ట్యా ట్యాంకులో తాగునీరు నింపడం సాధ్యపడదు. దీంతో నేరుగా కుళాయిలకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఉదయం 6 నుంచి 9గంటల వరకు వెంకటేశ్వరపురం, పునరావాస కాలనీ, నల్లకాలువ, విజయ డెయిరీ, పెట్రోలు బంకు డౌన్ ప్రాంతాలకు, అదేవిధంగా మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6గంటల వరకు ఇస్లాంపేట, నేతాజీ వీధి, లక్ష్మీ వీధి, లంగర్‌తోట, రెహమాన్ వీధి ప్రాంతాలకు తాగునీటి సరఫరా అందివ్వనున్నట్లు డీఈ తెలిపారు. తాగునీరు కుళాయిల నుంచి వేగంగా రావని కాస్త సన్నగా నెమ్మదిగా వస్తాయని చెప్పారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

ఎన్‌సీసీ ట్రెక్కింగ్ క్యాంపునకు జడ్పీ పాఠశాల విద్యార్థి



జడ్పీ పాఠశాలలో విద్యార్థిని అభినందిస్తున్న సిబ్బంది

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ ఉమ్మడి రాష్ట్రాల డైరక్టరేట్ ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు అరకువ్యాలీలో జరిగే ఎన్‌సీసీ ట్రెక్కింగ్ క్యాంప్‌కు నగరంలోని దర్గామిట్ట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థి కె.బ్రహ్మనిఖిల్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పీవీ.కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 10 ఆంధ్ర నేవెల్ యూనిట్ ఎన్‌సీసీ కేడెట్‌గా తమ విద్యార్థి ఈ క్యాంపు ఎంపికవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ధనుంజయ రావు, ఉపాధ్యాయులు, కేడెట్స్ పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్ డే క్యాంపునకు గురుచరణ్

నగరంలోని వెంగళరావునగర్ మునిసిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి పీ.గురుచరణ్ ప్రీ రిపబ్లిక్ డే క్యాంపునకు ఎంపికైనట్లు హెచ్ఎం సీ.మంజులవాణి తెలిపారు. పాఠశాలలో శనివారం ఆ విద్యార్థిని అభినందించారు. గుంటూరులో పది రోజుల పాటు గ్రూప్ కమాండర్ సారధ్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి తమ విద్యార్థి ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగం ఉన్నతికి కృషి చేయాలి : ఏపీసీ

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెడుతున్న విద్యారంగ మార్పులను గుర్తిస్తూ, వాటిని ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తెలియచేస్తూ విద్యారంగ ఉన్నతికి కృషి చేయాలని సమగ్రశిక్ష ఏపీసీ డీ.వెంకటసుబ్బయ్య అన్నారు. నగరంలోని దర్గామిట్ట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాలలో పనిచేసే ఒకేషనల్ ట్రైనర్స్‌కు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నో కొత్త కోర్సులు, నూతన పద్ధతులు ప్రవేశపెడుతున్న తరుణంలో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ వీటిని అనుసరించాలన్నారు. దసరా సెలవుల్లో నిర్వహించనున్న ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా అందరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో మమత, ఎంఈవో మురళీధర్, ఏపీవో ప్రసాద్, ఒకేషనల్ కోఆర్డినేటర్‌లు పాల్గొన్నారు.



ప్రభుత్వ నిర్ణయంతో కార్మిక సంక్షేమ పథకానికి మోక్షం

● విజయకుమార్‌రెడ్డి, జిల్లా కార్మికశాఖ ఇన్‌చార్జి ఉపకమిషనర్

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అమలులో ఉన్న వివిధ కార్మిక చట్టాలు, కార్మిక సంక్షేమ పథకాలు గురించి జిల్లా కార్మిక శాఖ ఇన్‌చార్జి ఉపకమిషనర్ సీహెచ్.విజయకుమార్‌రెడ్డి వివరించారు. తన కార్యాలయంలో ఆంధ్రజ్యోతితో ముఖాముఖిగా మాట్లాడారు.

? భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకం అమలవుతుందా.

! భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం 1996లో ప్రభుత్వ చట్టం చేసింది. అది 2005 నుంచి అమలులోకి తెచ్చింది.

? జిల్లాలో ఎంతమంది భవన నిర్మాణ కార్మికులు నమోదు చేసుకున్నారు.

! 2005 నుంచి 1,32,000 మంది రిజిస్టర్ చేసుకున్నారు. 2025లో ఆగస్టు వరకు 206 మంది రిజిస్టర్ చేసుకున్నారు.

? కార్మికులకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయా.

! 2021లో అప్పటి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు నిలిపివేసింది. ప్రస్తుతం భవన నిర్మాణ సంక్షేమ ఫలాలకు ఎలాంటి దరఖాస్తులు తీసుకోవడంలేదు.భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు అమలు ప్రభుత్వం నిర్ణయం మీదే ఉంది.

? ఈ శ్రమ్ పథకం గురించి తెలపండి

! ఈ శ్రమ్ పథకాన్ని అసంఘటిత కార్మికుల గణన కోసం కేంద్రం ప్రవేశ పెట్టింది. దరఖాస్తు చేసుకున్న ప్రతీ అసంఘటిత కార్మికునికి కార్డు ఇస్తుంది. 2021 నుంచి ఈ పథకం అమలులో ఉంది. ఈ శ్రమ్ కార్డు దారులకు 12 సంక్షేమ పథకాలు అమలు చేయాలని కేంద్రం ఆలోచనలో ఉంది.

? బాలకార్మిక నిరోధక చట్టానికి ఎలా అమలు చేస్తున్నారు.

! ప్రతీ 3నెలలుకి బాల కార్మిక చట్టంపై ప్రత్యేక డ్రైవ్‌లు చేస్తున్నాం.

? భవన నిర్మాణ కార్మిక సంక్షేమ నిధికి సెస్సు ఎంత వసూలైంది

! భవన నిర్మాణ కార్మిక సంక్షేమ నిధికి ఈ నెలవరకు జిల్లాలో రూ.16.40వేలు వసూలైంది.

? కార్మిక చట్టాలు ఎలా

! ఈ సంవత్సరం ఇప్పటివరకు కార్మిక నష్ట పరిహార చట్టం కింద 12కేసుల్లో రూ.29లక్షలు కార్మికులకు ఇప్పించాం. కార్మికులు - యజమానులకు వచ్చిన వివాదాలపై జాయింట్ కమిటీ సమావేశాల్లో 36 మందికి రూ.23.77వేల పరిహారం ఇప్పించాం.



మంబాయి హైవేకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న ఇసుక

హైవే నిర్వహణ ఇలాగేనా..!?

నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారి నిర్వాహణ ఏజెన్సీ రోడ్డు నిర్వహణను గాలికి వదిలేసింది. రహదారిలో ద్విచక్ర వాహనాలు, బాటసారులు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన మార్జిన్‌లో ఎటు చూసినా ఇసుక చేరి ప్రమాదకరంగా ఉంది. అసలే ఇరుకైన రహదారిలో ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే పక్కన ద్విచక్రవాహనాలు వెళ్లేందుకు అవకాశం లేదు. రోడ్డుకు ఇరువైపులా ఇసుక, మట్టి ఉండటంతో పట్టుజారి ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. ఎప్పటికప్పుడు శుభ్రం చేయాల్సిన ఏజెన్సీ బాధ్యులు చేతులెత్తేశారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)



స్త్రీశక్తి.. ప్రయాణంపై ఆసక్తి !

ఉదయగిరి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల అమల్లో భాగంగా ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకానికి మహిళల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఉచిత ప్రయాణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. బస్సుల్లో అక్యుపెన్సీ శాతం పెరిగి ఆర్టీసీ ఆదాయం వృద్ధి చెందుతోంది.ఆగస్టు 15న స్త్రీశక్తి పథకం ప్రారంభం అయ్యింది. నిత్యం నెల్లూరు రీజియన్ పరిధిలోని ఏడు డిపోల పరిధిలో గతంలో రోజుకు 40 వేలు మంది ప్రయాణించేవారు, స్త్రీశక్తి పథకం అమలు చేసిన తరువాత 70 వేల మంది ప్రయాణిస్తున్నారు. అందులో 60 శాతం మంది మహిళలే ఉన్నారు. ప్రధానంగా నెల్లూరు-1,2 గూడూరు, ఆత్మకూరు, కావలి, కందుకూరు, ఉదయగిరి డిపోల పరిధిలో అక్యుపెన్సీ బాగా పెరిగింది. గతంలో రీజియన్ పరిధిలో అక్యుపెన్సీ 68 ఉండగా ప్రస్తుతం అది 81కి చేరింది.



బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న మహిళలు

అక్యుపెన్సీ శాతం పెరిగింది...

స్త్రీశక్తి పథకం అమలుతో రీజియన్ పరిధిలో అక్యుపెన్సీ శాతం బాగా పెరిగింది. గతంలో 68 ఉండగా స్త్రీశక్తి పథకం అమలు చేసిన తరువాత 81కి చేరింది. యంలో అదనపు సర్వీసులు నడిపేందుకు చర్యలు చేపడతాం.

- షేక్ షమీమ్, ఆర్ఎం

జీవితం జ్ఞాపకాల దొంతర అంటారు. గడిచిన కాలంలోని మధుర ఘట్టాలను స్మరించుకోవాలంటే జ్ఞాపకశక్తి ఉండాలి. అయితే వయసు మళ్లేకొద్దీ మతిమరుపు అనే వ్యాధి జ్ఞాపకశక్తి హరిస్తుంటుంది. ఇది అనేక అనర్థాలకు దారితీస్తుంది. కొన్నిసార్లు ప్రమాదాలకు హేతువు కూడా అవుతుంది. కొంతకాలానికి శారీరక వ్యవస్థ మీద నియంత్రణ కోల్పోయి జీవితం అస్తవ్యస్తం అవుతుంది. ఇలా జ్ఞాపకశక్తిని కోల్పోవటమే వైద్య పరి భాషలో అల్జీమర్స్ (మతిమరుపు) అంటారు. జ్ఞాపకశక్తి క్రమేపి తగ్గిపోయి (డెమెన్షియా) వ్యాధికి గురై బంధువులు, స్నేహితులతోపాటు కుటుంబ సభ్యులను కూడా గుర్తుపట్టలేని స్థితికి చేరుకోవ డమే అల్జీమర్స్. ఈ వ్యాధిగ్రస్థులకు కుటుంబ సభ్యుల సహకారం ఎంతో అవసరం. వ్యాధి నిర్లక్ష్యం చేస్తే మంచా నికే పరిమితమయ్యే పరిస్థితి వస్తుంది.

- నెల్లూరు(వైద్యం),(ఆంధ్రజ్యోతి)

మతిమరుపు.. ముంచేస్తుంది!

నేడు ప్రపంచ అల్జీమర్స్ డే



- అల్జీమర్స్ వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు
- కుటుంబ సభ్యుల సహకారం ఎంతో అవసరం
- 60ఏళ్లు దాటితే జాగ్రత్త అంటున్న వైద్యులు
- జిల్లాలో 90వేల మందికిపైగా వ్యాధిగ్రస్థులు

వేల సంఖ్యలో బాధితులు

అల్జీమర్స్ వ్యాధిగ్రస్థులు జిల్లావ్యాప్తంగా 90 వేల మందికిపైగా ఉన్నారు. 60 ఏళ్ల నుంచి 75 ఏళ్ల వయసులో ఉన్న వారిలో 10శాతం మంది, 85 ఏళ్ల పైబడిన వారిలో 50 శాతం మంది ఈ వ్యాధికి గురవుతున్నట్లు వైద్యులు తెలియజేస్తున్నారు. ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లో ఉన్న వారే ఈ వ్యాధికి గురవుతున్నారు. మానసిక ఒత్తిడికి అల్జీమర్స్‌కు అవినాభావ సంబంధం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. మనిషి ఒత్తిడికి గురయినప్పుడు మెదడులో విషయగ్రహణ చర్యను అడ్డుకునే అల్లోప్రెగనోలోన్ అనే స్టెరాయిడ్స్ స్థాయిలు అధికమవుతాయి. ఇది ఎక్కువ కాలం కొనసాగితే అల్జీమర్స్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. అల్జీమర్స్ వ్యాధితో మెదడు కణాలు దెబ్బతింటాయి. అందుకని ఒత్తిడిని బాగా తగ్గించుకోవాలి.

జ్ఞాపకశక్తి క్రమేపీ తగ్గిపోయి (డెమెన్షియా), తెలివి(మెమోరీ) తగ్గి బంధువులు, స్నేహితులతోపా టు కుటుంబ సభ్యులను మరిచిపోయే స్థాయికి చేరుకోవడం అల్జీమ ర్స్ వ్యాధి లక్షణం. ఈవ్యాధిని నిర్లక్ష్యం చేస్తే వ్యాధిగ్రస్థుడు మంచాని కే పరిమితం కావాల్సిందే. తద్వారా కు టుంబ సభ్యుల అనాదరణకు గురవుతా రు. 60 ఏళ్ల నుంచే మతిమరుపు వ్యాధి ప్రారంభమై 80 ఏళ్లకు తీవ్ర దశకు చేరుతుంది. ఈ వ్యాధి కారణంగా కొంతమంది నిద్రలోనే ప్రాణాలు కోల్పోతారు. వ్యాధి వచ్చిన వారిని ఒంటరిగా వదలకూడదు.

● మొదట్లోనే జాగ్రత్త పడాలి

మొదటిదశలోనే అల్జీమర్స్‌ను గుర్తిస్తే వ్యాధితీవ్రత నియంత్రించవచ్చు. ఒకసారి వ్యాధికి గురైతే పూర్తిగా నివారణ వీలుకాదు. నియంత్రణ మాత్రమే చేయవచ్చు. వయసు మీరక పోయినా, తలలో రక్తం గడ్డకట్టడం, తలకు తీవ్ర గాయం అయినప్పుడు ఈ లక్షణాలు కనిపిస్తే అల్జీమర్స్ వ్యాధిగా నిర్థారించరాదు. రక్తంలో సోడియం, క్రియాటిన్, థైరాయిడ్ మోతాదు తగ్గితే అల్జీమర్స్ వ్యాధి లక్షణాలు బయటపడతాయి. సాధారణ రక్తపరీక్షల ద్వారా వీటి మోతాదును తెలుసుకోవచ్చు, ఎంఆర్ఐ, సిటీస్కాన్ చేయటం ద్వారా కూడా నిర్ధారణ చేయవచ్చు. వెన్నులోని కొంత నీరు తీసుకుని సీఎస్ఎఫ్ పరీక్ష ద్వారా వ్యాధిని కనుక్కోవచ్చు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే మందులతో నయం చేయవచ్చు. వైద్యుల పర్యవేక్షణలో 3 నుంచి 6 నెలల్లో వ్యాధిని నియంత్రించుకునే అవకాశం ఉంది. రోగి రోజూ చేసే పనులను గుర్తుచేసుకునేలా కుటుంబ సభ్యులు సహకారం అందించాలి.

ఎన్నో ఆధునిక వైద్య విధానాలు



అల్జీమర్స్ నియంత్రణకు ఆధునిక మందులు అందుబాటులోకి ఉన్నాయి. మోనోక్లోమా యాంటీబాడీస్ వంటి మందుల ద్వారా వ్యాధిని నియంత్రించే వీలుంది. ఎంఆర్ఐ, పెట్‌స్కాన్‌ల ద్వారా వ్యాధిని గుర్తించవచ్చు. ముందుగా మెదడులో ఏ ప్రాంతం దెబ్బ తిన్నదో తెలుసుకోవాలి. అప్పుడే సరైన వైద్యం అందించవచ్చు. ముఖ్యంగా 60 ఏళ్ల దాటిన వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా వహించాలి.

- డాక్టర్ సంపత్‌కుమార్, న్యూరోఫిజీషియన్, నారాయణ ఆసుపత్రి

జాగ్రత్తగా ఉండాలి



నిత్యం కుటుంబ సభ్యులు వారి దినచర్యను గమనిస్తూనే ఉండాలి. ప్రత్యేక పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించి చికిత్స అందించాలి. ఆ దిశగా చికిత్స ఇస్తున్నాం. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే నయం చేసే వీలుంటుంది. వ్యాధి మూడో దశకు చేరితే నివారణకు మందులు లేవు. ధూమపానం మానేయాలి. వ్యాయామం చేయాలి.

- డాక్టర్ దీక్షాంతి నారాయణ్, న్యూరాలజిస్ట్, మెడికవర్ ఆసుపత్రి

రేపు విశ్రాంత ఉద్యోగుల సమావేశం

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల జిల్లాస్థాయి సమావేశం ఈనెల 22వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు నెల్లూరు నగరంలోని టౌన్‌హాల్లో నిర్వహించనున్నట్లు ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ.లక్ష్మీనారాయణ, కార్యదర్శి వీ.వెంకయ్య ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో డీఏ, పీఆర్సీ తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. అందరూ తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

అల్లూరు, (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక అక్షరాస్యతపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. మండలంలోని ఇస్కపల్లి సచివాలయం వద్ద శనివారం రిజర్వ్ బ్యాంక్ డీఈఏ సహకారంతో ఫండ్, కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సంస్థ ద్వారా అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు పలు పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కెనరాబ్యాంక్ మేనేజరు గౌతమ్, సీఎఫ్ఐ కౌన్సిలర్ సభ్యులు సయ్యద్ నయాబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌టెక్ వెల్ నిర్మాణానికి స్థల పరిశీలన

సంగం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెన్నానది నుంచి బుచ్చికి తాగునీటిని సరఫరా చేసేందుకు నిర్మించనున్న ఇన్‌టెక్ వెల్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని శనివారం ఇరిగేషన్ ఎస్ఈ దేశ్ నాయక్, పబ్లిక్ హెల్త్ ఈఈ గిరిధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమృత్ -2 పథకంలో బుచ్చికి రూ. 85 కోట్లతో తాగునీటి పథకం మంజూరు కాగా, సంగం పెన్నానది నుంచి నీటి తరలించే పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు. సంగంలో ఇన్‌టెక్ వెల్ నిర్మాణానికి స్థలం కావాలని పబ్లిక్ హెల్త్ అధికారులు కోరగా, కోరిన చోట స్థలం కేటాయించేందుకు పరిశీలించామన్నారు. పనుల్లో భాగంగా బుచ్చిలో ఇప్పటికే ఐదు ట్యాంకులకు శ్లాబులు పూర్తయాయన్నారు. మిగిలిన మూడు ట్యాంకులు పనులు జరుగుతున్నాయన్నారు. సంగం తిరుమనతిప్పలో నీటిని శుద్ధి చేసే ప్లాట్ పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు. పట్టణంలో కూడ అంతర్గత పైపులైన్ల పనులు 60 శాతం పూర్తయిందన్నారు. మరో ఏడు నెలల్లో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ డీఈ జానికీరామిరెడ్డి, ఏఈ జీవన్, కాంట్రాక్టర్ ఆనందర్ తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌టెక్ వెల్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్ అధికారులు

వేరుశనగకు నోడల్ ఏజెన్సీనే మార్కెటింగ్ కల్పించాలి

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి: కొత దశలో ఉన్న వేరుశనగ పంటకు నోడల్ ఏజెన్సీ ద్వారానే మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి ఆదేశించారు. జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శనివారం ముత్తుకూరు రోడ్డులోని వ్యవసాయ పరిశోధన స్థానం (ఏఆర్ఎస్)లో శిక్షణ, సందర్శన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ ఆహార నూనె గింజల పథకంపై జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పథకం కింద 2025-26 సంవత్సరానికి జిల్లాకు రెండు యూనిట్లు వేరుశనగ, మరో రెండు యూనిట్లు నువ్వులు లక్ష్యం కేటాయించారని చెప్పారు. రైతు ఉత్పాదక సంఘాల బలోపేతం కోసం మార్గదర్శకాల ప్రకారం చైతన్య జ్యోతి (కలిగిరి)ని నోడల్ ఏజెన్సీగా ఎంపిక చేశారన్నారు. వింజమూరు, పొదలకూరు సబ్‌డివిజన్లలో మినుము పంటకు ప్రత్యామ్నాయంగా జొన్న పంటను సాగు చేయవచ్చని సూచించారు. అనంతరం జిల్లాలో యూరియా పంపిణీపై సమీక్షించారు. ఈ సందర్భంగా పంట కోత ప్రయోగాలు, పంటల బీమా తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డీ.వెంకటేశ్వర్లు, కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ లలితాశివజ్యోతి, పొదలకూరు ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రసన్న రాజేష్, ఏడీఏ నర్సోజీరావు, సుజాత, సీపీవో లక్ష్మీ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఏవో సత్యవాణి, పక్కన శాస్త్రవేత్తలు



సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని విద్యుత్ జేఏసీ నేత తలమంచి శ్రీనివాసులు హెచ్చరించారు. నెల్లూరులోని జిల్లా సర్కిల్ కార్యాలయం వద్ద శనివారం విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఆరవ రోజు రిలే దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన సమస్యల పట్ల యాజమాన్యం, ప్రభుత్వం తక్షణమే సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు. తమ కార్యాచరణలో భాగంగా సోమవారం కలెక్టరేట్ వద్ద శాంతియుత ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు పీ దామోదర్, శ్రీనివాసులు, నజీర్ ఖాన్, వెంకటేశ్వర్లు, రఫీ, నవాబ్ జాన్, కాంట్రాక్ట్ యూనియన్ నేతలు షేక్ హజరత్ వలి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్ష చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు

మాలకొండ ఆదాయం రూ.5,77,144

వలేటివారిపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తుల నుండి రూ. 5,77,144 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్ల ద్వారా రూ. 6, 300, కుంకుమార్చన ద్వారా రూ. 15,080, తలనీలాల ద్వారా రూ. 21,100, వాహనపూజల ద్వారా రూ. 2,100, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 1,13,900, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 600, గదుల అద్దెల ద్వారా రూ. 28,360, కవర్ల ద్వారా రూ. 8 వేలు, లడ్డూప్రసాదం ద్వారా రూ. 1,80, 620, అన్నదానం ద్వారా రూ. 1,51,084, అంతరాలయ దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 50 వేల ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

అంతరాలయ దర్శనం టిక్కెట్ రూ. 500

మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం నుండి అంతరాలయ దర్శనం టిక్కెట్లను అధికారులు అమల్లోకి తీసుకొచ్చారు. అంతరాలయ దర్శనాలకు వెళ్లే భక్తులకు రూ. 500 టిక్కెట్లను విక్రయించారు. వంద రూపాయల టిక్కెట్ ద్వారా భక్తులు ప్రత్యేక క్యూలో వెళ్లి స్వామిని దర్శించుకుంటారు. రూ. 500 అంతరాలయ టిక్కెట్ ద్వారా ప్రత్యేక క్యూ ద్వారా స్వామి గర్భగుడిలోకి వెళ్లే భక్తులకు గోత్రనామాలు చదివి, ప్రత్యేక పూజలు చేయిస్తారు.

పంట 'పడింది'

- వర్షాలతో నేలకొరిగిన ఎడగారు వరి
- దిగుబడులు పెరిగినా దక్కని సంతోషం
- ఎకరం కోతకు 2 గంటల సమయం
- పెట్టుబడులు పెరిగి నష్టాలు

నెల్లూరురూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : ఎడగారులో సాగు చేసిన వరి గతం కంటే బాగా పండింది. అయితే రైతుల దురదృష్టమో ఏమోగానీ కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో కోత దశలో ఉన్న వరి పైరు నేలకొరిగింది. దీంతో ధాన్యం నాణ్యత కోల్పోవడమేకాక ఎకరం కోతకు రెట్టింపు సమయం పడుతుండడంతో పెట్టుబడులు పెరుగుతోన్నాయి. ఫలితంగా అధిక దిగుబడులు వచ్చినా నష్టాలే మిగులుతోన్నాయి. ఈసారి ఎడగారుకు సాగునీటి వనరులు సమృద్ధిగా ఉండటంతో రైతులు పూర్తి విస్తీర్ణంలో వరి సాగు చేశారు. రబీలో పండించే సన్న రకాలను తిరిగి ఎడగారులోనూ సాగు చేశారు. ఎడగారు వ్యవసాయ సీజన్‌లో ధాన్యం దిగుబడి రెండున్నర పుట్లకు మించదు. అలాంటిది ఈసారి మూడున్నర పుట్ల వరకు వస్తోంది. కొన్ని చోట్ల అంతకు మించి కూడా దిగుబడి చేతికందుతోంది. రైతులు ఆశించిన దానికంటే పుట్టి ధాన్యం ఎక్కువగా దిగుబడులు వస్తున్నా వారిలో ఆనందం కపించడం లేదు. నైరుతి రుతుపవనాలు నిష్క్రమిస్తున్న సమయంలో కొద్ది రోజులుగా వర్షాలు పడుతున్నాయి. దీంతో కోతకు సిద్ధమైన పైరు నేలకొరిగింది. అక్కడక్కడ నీట మునుగుతుండడంతో చేతికందిన వరి పంట చేజారి రైతు ఆరుగాలం కష్టం 'నైరుతి' పాలైందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరొకపక్క ఎకరం వరి కోతకు సాధారణంగా గంట సమయం సరిపోతోంది. కానీ పైరు నేలకొరగడంతో కోత కోసేయంత్రానికి ఎకరా 2 గంటల వరకు పడుతోంది. ప్రస్తుతం ఎకరం కోతకు యంత్ర నిర్వహకులు రూ.2,600లు వసూళ్లు చేస్తుండగా రెండు గంటలు సమయానికి రూ.5,200లు తీసుకుంటున్నారు. చేతికందిన దిగుబడుల ఆదాయం కాస్త మిషన్ కోత అదనపు సమయానికి సరిపోతోంది. పైగా ధాన్యం తడిచిందంటూ పొలాల్లోనే వడ్లను కొనుగోలు చేసే దళారులు కొర్రీలు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో పొలాల్లోని ధాన్యం బయటకు తీసుకువచ్చేందుకు ట్రాక్టర్లకు అదనంగా డబ్బులు చెల్లించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇవన్నీ వెరసి ఖర్చులు భారీగా పెరగడంతో అదనపు దిగుబడి వచ్చిన సంతోషం లేదని, తీవ్ర నష్టాలు మిగులుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటు ధరలు తగ్గడంతో రైతుల్లో ఆనందం కనిపించడం లేదు.

డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు 878 బేళ్లను తీసుకొని రాగా 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 729 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 149 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 345 కాగా కనిష్ఠ ధర రూ. 90 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10588
వెండి కిలో ధర	రూ. 135100
వెండి ఒక గ్రాము	రూ. 138.10

న్యూస్ బాక్స్

మానసిక వికాసానికి క్రీడలు దోహదం



మాట్లాడుతున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ రిజిస్ట్రార్ సునీత

ఆత్మకూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక వికాసానికి ఎంతగానో దోహదపడతాయని విక్రమ సింహపురి యూనివర్సిటీ రిజిస్ట్రార్ సునీత పేర్కొన్నారు. శని వారం ఆమె స్థానిక ఎస్ఆర్‌జె డిగ్రీ కళా శాలలో విక్రమ సింహపూరి విశ్వ విద్యాలయం అంతర కళాశాలల క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ క్రీడలు మానస వికాసానికి దోహద పడతాయని, ప్రతిఒక్కరు క్రీడల్లో పాలొ నాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో కళాశాల ప్రిన్సిపాల్ వరకుమారి, యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ వెంకట్రాయులు, కార్యదర్శి సిరి మామిళ్ల వెంకటేశ్వర్లు, పరిశీలకులు పి ప్రసాదరెడ్డి, టీ శ్రీనివాసులురెడ్డి, పీజీలు రవీంద్రబాబు, అమ్మాజి కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రహదారుల వెంట పిచ్చిమొక్కల తొలగింపు



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

ఉదయగిరి, సెప్టెంబు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం పంచాయతీలో శనివారం జీఎంకే ట్రస్టు అధినేత, వైస్ ఎంపిపి గుంటుపల్లి మాల కొండయ్య చౌదరి ఆధ్వర్యంలో రహదారులకు ఇరువైపులా ఏపుగా పెరిగిన మొక్కలను ఎక్స్‌కవేటర్ ద్వారా తొలగించారు. ఈసందర్భంగా ట్రస్టు ప్రతినిధులు వెంకటేశ్వర్లు, గోపిలు మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామానికి ఇరువైపులా, బీసీ, ఎస్సీ కాలనీల్లో రహదారికి ఇరువైపులా, పాఠశాల, ప్రభుత్వ వైద్యశాలలో ఏపుగా పెరిగిన మొక్కలను తొలగించి శుభ్రం చేయడం జరుగుతుందన్నారు. రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలకు పాదులు చేయడం జరుగుతుందన్నారు. తొలుత టెంకాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గాంధీ, మాలకొండయ్య, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యాలయానికి దిక్కెవరు?



తాళాలు వేయకుండా ఉన్న ఉపాధి హామీ కార్యాలయం

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు ఉపాధి కార్యాలయంపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. గురువారం కార్యాలయంలో ఈసీ, టీఏలు తీవ్ర వాగ్వివాదానికి దిగిన సంఘటన మరువకముందే మరోమారు ఆ కార్యాలయ ఉద్యోగుల నిర్లక్ష్యం బహిర్గతమైంది. శుక్రవారం విధులకు హాజరైన ఉద్యోగులకు కావలికి రావాలని ఏపీడీ సూచించడంతో అందరూ వెళ్లారు. కానీ వెళ్లిన వారు కార్యాలయానికి రాలేదు. దీంతో శుక్రవారం తెరిచిన కార్యాలయ తలుపులు శనివారం ఉదయం వరకు అలాగే ఉన్నాయి. కార్యాలయంలో విలువైన కంప్యూటర్లు, ప్రింటర్లు, రికార్డులు, ఇతరత్రా సామాగ్రి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నిరుపయోగంగా చెత్త బుట్టలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మించిన ప్రభుత్వం నివాసాల నుంచి తడి, పొడిచెత్తను సేకరించేందుకు ప్లాస్టిక్ చెత్తబుట్టల పంపిణీకి శ్రీకారం చుట్టింది. కాగా, తోటల చెరువుపల్లి సచివాలయంలో నెలల తరబడి పంపిణీకి నోచుకోక చెత్తబుట్టలు నిరుపయోగంగా పడిఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బుట్టలను పంపిణీచేసి ప్రజలు విని యోగించుకునేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గ్రామీణ రహదారులకు మహర్దశ

● రూ. 7.25 కోట్ల నిధుల మంజూరు ● తీరనున్న ఏడు గ్రామాల ప్రజల అవస్థలు ● హర్షం వ్యక్తంచేస్తున్న గ్రామస్థులు



వెట్‌మిక్స్‌తో చదును చేసిన వంగల్లు - మర్రిపాడు రహదారి



ఎక్స్‌కవేటర్‌తో దువ్వూరులో రహదారికి మార్జిన్ చదును చేయిస్తున్న అధికారులు

సంగం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడు గ్రామాలకు చెందిన మూడు గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టింది. ఎండీఆర్, నాబార్డు నిధుల నుంచి సుమారు రూ. 7.25 కోట్ల నిధులు మంజూరయ్యాయి. సుమారు 19 కిలోమీటర్ల తారురోడ్డు, ఒక కిలోమీటరు దూరం సీసీ రోడ్డు నిర్మించనున్నారు. ఆమేరకు పనులు జోరుగా సాగుతున్నాయి.

పదేళ్లుగా రహదారులను పట్టించుకోని పాలకులు

మండలంలోని వంగల్లు నుంచి జంగాలకండ్రిక, మర్రిపాడు వరకు సుమారు 8 కిలోమీటర్ల దూరం రహదారి అధ్వానంగా ఉంది. గతంలో కాంగ్రెస్ పాలనలో ఆర్థిక మంత్రిగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో నిధులు మంజూరు చేయడంతో తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఆతరువాత వచ్చిన పాలకులు పదేళ్లుగా రహదారి గురించి పట్టించుకోలేదు. దీంతో గుంతలమయమై ప్రయాణం నరకంగా మారింది. అదేవిధంగా నెల్లూరు జాతీయ రహదారి నుంచి పడమటిపాళెం వరకు సుమారు 6 కిలోమీటర్ల దూరం, జాతీయ రహదారి నుంచి దువ్వూరు, మక్తాపురం మీదుగా, పల్లిపాళెం, అన్నారెడ్డిపాళెం వరకు సుమారు 5.6 కిలోమీటర్ల దూరం రహదారి అధ్వానంగా తయారైంది. దీంతో ఈ రహదారిపై ప్రయాణం చేయలేక గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. గుంతలమయమైన రహదారుల్లో ప్రయాణించే వాహనాలు సైతం మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారులపై ప్రయాణమంటే హడలి పోతున్నారు.

కూటమి ప్రభుత్వంలో నిధులు మంజూరు

ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వంలో దేవదాయశాఖ మంత్రిగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి మండలంలోని గ్రామీణ రహదారుల దుస్థితిని గమనించి ఆయా గ్రామస్థుల కోరిక మేరకు వంగల్లు - మర్రిపాడు రహదారికి రూ. 2.75 కోట్లు, పడమటిపాళెం రహదారికి రూ. 2.25 కోట్లు, దువ్వూరు - అన్నారెడ్డిపాళెం రహదారికి రూ.2.25 కోట్ల చొప్పున ఎండీఆర్, నాబార్డు నుంచి నిధులు మంజూరు చేయించారు. ఆమేరకు టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. వంగల్లులో ఇప్పటికే 500 మీటర్ల పొడవున సిమెంట్ రోడ్డు పూర్తి చేశారు. మిగతా తారు రోడ్డుకు వెట్‌మిక్స్ వేసి చదును చేస్తున్నారు. అదేవిధంగా పడమటిపాళెం రహదారికి వెట్‌మిక్స్‌తో చదును చేశారు. ప్రస్తుతం దువ్వూరులో 500 మీటర్ల సీసీ రోడ్డుకు వెట్‌మిక్స్‌తో బీటీ రోడ్డు వేస్తున్నారు. దీంతోపాటే తారురోడ్డు నిర్మాణానికి ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు మార్జిన్‌లు చదును చేస్తున్నారు. కాగా, ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే జంగాలకండ్రిక, మర్రిపాడు, పడమటిపాళెం, దువ్వూరు, మక్తాపురం, పల్లిపాళెం, అన్నారెడ్డిపాళెం సుమారు ఏడు గ్రామాల ప్రజల ప్రయాణ సౌకర్యం మెరుగు పడుతుంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహిళల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం : ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం చేపట్టిందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శనివారం వింజమూరు పంచాయతీ ప్రాంగణంలో నిర్వహించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్, స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు నిర్వహిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా, చిరుఉద్యోగులు చాలీచాలని జీతాలతో జీవనం గడుపుతున్నారని, వారికి ప్రభుత్వ పథకాలు అందక ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం పంచాయతీ కార్మికులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి, జడ్పీటీసీ సభ్యులు కంభం బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ నల్లగొండ సృజన, పంచాయతీ సెక్రటరీ రామారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

● **ఉదయగిరి:** స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య నిపుణులచే రోగులకు వైద్య సేవలందించారు. ఈసందర్భంగా గైనకాలజిస్టు, చిన్న పిల్లల, కంటి, ఈఎన్‌టీ, చర్మవ్యాధి, ఎముకలు, కీళ్ల, దంత వైద్య నిపుణులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, సొసైటీ అధ్యక్షుడు గడ్డం వెంకటసామయ్య, మాజీ జడ్పీటీసీ కలివెల జ్యోతి, వైద్యులు ప్రశాంత్, రాగూర్, శివరాం, సురేష్ పాల్గొన్నారు.

గుడినరవలో వైద్యశిబిరం

మండలంలోని గుడినరవ గ్రామంలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి వినీత ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త ఎండీ మన్సూర్‌అలీ, హెచ్‌వీ వెంకటేశ్వర్లు, ఆరోగ్య పర్యవేక్షకులు చెన్నయ్య, అంకమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **సంగం:** మండలంలోని మర్రిపాడు, వంగల్లు, జంగాలకండ్రిక గ్రామాల్లో శనివారం స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక వైద్యాధికారి డాక్టర్ అశోక్ గ్రామస్థులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. ఐసీడీయస్ ఆధ్వర్యంలో ఆకుకూరలు, కూరగాయలు, పిండి వంటలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వైద్యఆరోగ్య సిబ్బందితో పాటు ఐసీడీయస్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ఉదయగిరి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని, విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని డిప్యూటీ ఎంపీడీవో షేక్ కరీముల్లా, ఎస్ఐ అల శ్రీను సూచించారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ పావులూరి సామ్రాజ్యంతో కలిసి విద్యార్థులచే అవగాహన ర్యాలీ చేపట్టి ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీధుల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పడవేయకుండా పంచాయతీకి ప్రజలు సహకరించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతన్నారు. అలాగే ఎంఆర్‌జీఆర్ ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో కళాశాల అసోసియేట్ డీన్ జీ.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి ఆధ్వర్యంలో గండిపాళెం జలాశయం వద్ద ఉన్న ముళ్లచెట్లను తొలగించి జనరేటర్ గదిని శుభ్రం చేశారు. ఎంఆర్‌జీఆర్ కనస్ట్రక్షన్ ఆధ్వర్యంలో 167-బీజీ జాతీయ రహదారిపై పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరి: మొక్కలు నాటుతున్న సర్పంచి, అధికారులు, విద్యార్థులు



ఆత్మకూరు: మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటుతున్న అధికారులు, నాయకులు

● **దుత్తలూరు:** దుత్తలూరు పంచాయతీ ఏఏ కాలనీలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ యనమల సుబ్బమ్మ, ఎంపీడీవో చెంచమ్మ మొక్కలు నాటారు. అనంతరం కాలనీలో అవగాహన ర్యాలీ చేపట్టి ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి నజీముల్లా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **ఆత్మకూరు :** స్థానిక మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ మాధవి, ఫారెస్ట్ రేంజ్ అధికారి శేఖర్, మున్సిపల్ వైస్‌చైర్మన్ సర్దార్, పట్టణ అధ్యక్షుడు టి చంద్రారెడ్డి, వార్డు కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


అట్టహాసంగా ఎమ్మెల్యే కాకర్ల జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే కాకర్లకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న మిత్రబృందం

ఉదయగిరి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జన్మదిన వేడుకలు శుక్రవారం రాత్రి వింజమూరులోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మిత్రబృందం, నియోజకవర్గంలోని కూటమి నాయకులు భారీసంఖ్యలో కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు, మొక్కలు అందజేసి మిఠాయిలు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందరర్భంగా ఎమ్మెల్యే నిండునూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండి నియోజకవర్గ ప్రజలకు మరింత సేవలందించి వారి ఆశీస్సులతో భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి

వింజమూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనధికారిక లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ఎల్ఆర్ఎస్‌ను పొడిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈఓ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో తప్పిదాలను సరిచేయాలని రైతుల ధర్నా



తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతులు

ఉదయగిరి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో చోటుచేసుకున్న తప్పిదాలను సరిచేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ రీసర్వేలో జరిగిన తప్పిదాలతో జాయింట్ ఎల్‌పీఎంలు నమోదై రైతులు పడరాని పాట్లు పడుతున్నారన్నారు. 1బీ, అడంగల్ రాక, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేక, బ్యాంకుల్లో రుణాలు ఇవ్వక రైతులు పొలాలను బీడు భూములుగా వదిలేశారన్నారు. తప్పిదాలను సరిచేయాలని కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రీసర్వేలో తప్పిదాలను సరిచేయాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ విజయయ్య, రైతులు పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ఉదయగిరి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు క్లస్టర్ సముదాయ సమావేశాలను సద్వినియోగం చేసుకుని బోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎంఈవో-2 టీ శ్రీనివాసులు సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న క్లస్టర్ సముదాయ సమావేశాలను పరిశీలించి తగు సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జీ శ్రీనివాసరావు, నూర్జహాన్, ఉపాధ్యాయులు తదితులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

లాడ్జీలో పేకాట

● బెట్టింగ్ డాన్ కృష్ణసింగ్‌తో పాటు 13 మంది అరెస్ట్



పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసిన చిన్నబజారు పోలీసులు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ లాడ్జీలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట కేంద్రంపై చిన్నబజారు పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బెట్టింగ్ డాన్ కృష్ణసింగ్ ఉండటంతో పోలీసులు ఆశ్చర్యానికి గురయ్యారు. పోలీసుల వివరాల మేరకు.. పొగతోట ప్రాంతంలోని పీఎస్‌కే లాడ్జీలో పేకాట నిర్వహిస్తున్నారని పక్కా సమాచారం అందుకున్న చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు తమ సిబ్బందితో కలిసి శనివారం దాడులు చేశారు. ఈ దాడుల్లో 14 మందిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించి విచారించారు. కిసాన్ నగర్‌కు చెందిన పెంచలయ్య పేకాట కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. బెట్టింగ్ డాన్ కృష్ణసింగ్‌తో పాటు మరో 12 మంది పేకాట ఆడుతున్నారని, వారి వద్ద నుంచి రూ.2,20,110 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఫోన్ చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆత్మకూరు బస్టాండులో ప్రయాణికుడు జేబులో నుంచి వన్‌ప్లస్ ఫోన్‌ను అపహరించిన కేసులో నిందితుడుని నవాబుపేట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వివరాలను నవాబుపేట ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 19వ తేది ఆత్మకూరు బస్టాండులో ఉన్న సురేంద్రబాబు జేబులో నుంచి వన్‌ప్లస్ మొబైల్‌ను గుర్తుతెలియని వ్యక్తి దొంగలించాడు. బాధితుడు నవాబుపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వెంటనే స్పందించిన ఇన్‌స్పెక్టర్ సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని శనివారం గుర్తించారు. అనకాపల్లి పట్టణంకు చెందిన గంట ఈశ్వరరావు ఫోన్‌ను దొంగలించినట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడు వద్ద నుంచి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మోటార్‌బైక్ చోరీ

ఉదయగిరి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో మోటార్‌బైక్ చోరీకి గురైన సంఘటన శనివారం తెల్లవారుజామున చోటుచేసుకొంది. వివరాల మేరకు.. కాలనీకి చెందిన పిడుగు నాగార్జున తన ఇంటి ముందు హీరోహోండా బైక్‌ను పార్కింగ్ చేశాడు. ఉదయం చూసేసరికి బైక్ కనిపించలేదు. తన నివాసంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ఫుటేజీలో చోరీ ఘటన నమోదై ఉంది. ఈ విషయమై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ఉదయగిరి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లాయపల్లి గ్రామానికి చెందిన ఐశ్వర్య అనే యువతి ఈనెల 13వ తేదీ నుంచి కనిపించడంలేదని అన్న పెనుగొండ రామాంజనేయులు శనివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ముగిసిన దస్తావేజు లేఖర్ల సమ్మె



రిజిస్ట్రార్ బాలాంజనేయులకు వినతిపత్రం అందచేసిన డాక్యుమెంటు రైటర్లు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : దస్తావేజుల రిజిస్ట్రేషన్ సాఫ్ట్‌వేర్‌లో లోపాలను సవరించాలని దస్తావేజు లేఖర్లు చేస్తున్న పెన్‌డౌన్ సమ్మె శనివారం ముగిసింది. జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులును దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం నాయకులు కలిసి డిమాండ్లు పరిష్కరించాలని వినతిపత్రం అందచేశారు. ఈ విషయాన్ని రిజిస్ట్రేషన్-స్టాంపుల శాఖ ఐజీ దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. దీంతో నాయకులు తాత్కాలికంగా సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం జిల్లా దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సోమవారం నుంచి యథావిధిగా కార్యకలాపాలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు. కాగా ఈ సమ్మెలో సిటీ దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేబీవీ అశోక్, నాయకులు పంచాగ్నుల పవన్‌కుమార్, ఎండీ జమీరుద్దీన్, ములుమూడి బాలసుబ్రహ్మణ్యం, ఎండీ మజహరుద్దీన్, ములుమూడి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సంబరం

● కసుమూరు, ఏఎస్‌పేటకు తరలివచ్చిన భక్తులు



ఏఎస్‌పేట : స్వామి వారి జపమాల ప్రదర్శిస్తున్న దర్గా ఈవో

వెంకటాచలం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలి గంధమహోత్సవం సందర్భంగా చివరిరోజు శనివారం చిన్న గంధం (తహలీల్ ఫాతేహ) వైభవంగా జరిగింది. స్థానిక చందన్ మహల్ (బంగళా) నుంచి గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చారు. కడప పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేని ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత మస్తాన్ స్వామి వారి సమాధికి గంధం లేపాన్ని పూశారు. అనంతరం దర్గా ముజావర్లకు గంధం బిందెను అందజేశారు. తెలుగు రాష్ట్రాల నుంచేగాక తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రాల రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరావడంతో కసుమూరు కిక్కిరిసిపోయింది. వచ్చిన భక్తులకు స్వామివారం గంధాన్ని పంచిపెట్టారు. సీఐ సుబ్బారావు, ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

● **ఏఎస్‌పేట :** శ్రీ హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గా గంధమహోత్సవంలో భాగంగా చివరి రోజు శనివారం భక్తి శ్రద్ధలతో తహాలీల్ ఫాతేహ నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఖురాన్ పఠనం చేసి భక్తులకు వివరించారు. ఫకీర్ల కీర్తనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. నాయబ్ రసూల్ స్వామి స్వయంగా ఉపయోగించిన జపమాలను దర్గా ఈవో మహమ్మద్ హుసేన్ ప్రదర్శించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	138
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	272

కోడిగుడ్ల ధర (100): 560

ఈవోపీఆర్డీ, ఏవోల బదిలీ

అల్లూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అల్లూరు మండల ఈవోపీఆర్డీగా విధులు నిర్వర్తిస్తున్న పెంచల వీరేంద్ర, ఏవోగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటేశ్వర్లులు బదిలీ అయ్యారు. పెంచల వీరేంద్ర ఎంపీడీవోగా పదోన్నతి పొంది చిత్తూరు జిల్లా యాదమరికి, వెంకటేశ్వర్లు ఎంపీడీవోగా పదోన్నతి పొంది చిత్తూరు జిల్లా, వి.కోటకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది వారికి సన్మానించి అభినందనలు తెలపగా టీడీపీ నాయకులైన ఇస్కపల్లి పంచాయతీ సర్పంచ్ పాటి రంజిత్ కుమార్, ఉపసర్పంచ్ పాపన బోయిున జగన్మోహన్‌రావు, వార్డు సభ్యుడు రవ్వా హరికుమార్‌లు వారిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఈవోపీఆర్డీ, ఏవోలను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

రాళ్లపాడు ప్రాజెక్టు నీటిమట్టం 9 అడుగులు

లింగసముద్రం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నాలుగైదు రోజులుగా ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం 9 అడుగులకు చేరింది. వరదనీరు ప్రాజెక్టులోకి చేరడంతో నీటిమట్టం 2.3 అడుగులు పెరిగింది. వర్షాలకు ముందు 6.9 అడుగుల మేర నీటిమట్టం ఉండేది. అయితే మరో మూడు, నాలుగు అడుగుల మేర నీరు వస్తే, ప్రాజెక్టులోని పచ్చని కలుషిత నీటి సమస్య తీరే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిలో నుండి మంచినీటి పథకాలకు ప్రతిరోజూ 7 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతున్నట్లు ప్రాజెక్టు డీఈఈ ఎం వేంకటేశ్వర్లు చెప్పారు.

భక్తులు నుదుట బొట్టు పెట్టాలి



భక్తులకు నుదుట బొట్టు పెట్టే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీసీ చంద్రశేఖర్

వలేటివారిపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులందరికీ అర్చకులు బొట్టు పెట్టడం వల్ల ఆధ్యాత్మికత సంతరించుకుంటుందని ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని మాలకొండ లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో శనివారం దర్శనానికి వేళ్లే భక్తులకు నుదుట బొట్టుపెట్టే కార్యక్రమాన్ని డీసీ చంద్రశేఖర్ ప్రారంభించారు. భక్తులు ఆలయంలోకి ప్రవేశించి, దర్శనానికి వెళ్లే ముందు అర్చకులచే నుదుట బొట్టు పెడితే భక్తుల్లో విశ్వాసం, భక్తితత్పరత పెంపొందుతాయని డీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

టీసీపాలెంలో స్వస్థ నారీ సశక్తి పరివార్



ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హైమావతి

బిట్రగుంట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం తాటిచెట్లపాలెంలో ప్రభుత్వ వైద్యులు రాజశేఖర్ ఆధ్వర్యంలో స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు కే గిరిబాబు, నాగులవరం పీఏసీఎస్ డైరెక్టర్ వీ సుధాకర్, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, ఆశావర్కర్లు, స్థానికులు తదితరులు ఉన్నారు.


రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌కు జడ్పీ బాలికల ఎంపిక



రాష్ట్ర, స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికైన బాలికలతో హెచ్‌ఎం

బిట్రగుంట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలోని పలువురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపిక కావడంతో ప్రధానోపాధ్యాయులు గంగాధర్‌రావు శనివారం వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన క్రీడా ఉపాధ్యాయులను అభినందించారు.

వరవ కాలువలో మట్టి తొలగింపు



వరవ కాలువలో తొలగించిన నీటి పారుదలకు అడ్డుగా ఉన్న మట్టి

కావలి,సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): కావలి అన్నపుగుంట నుంచి వరవ కాలువకు వెళ్లే మురుగునీటి ప్రవాహానికి గతంలో అడ్డుగా వేసిన మట్టి కట్ట ఆటంకంగా మారటంతో శనివారం ఆమట్టిని తొలగించారు. మున్సిపల్ అధికారులు ఎక్సకవేటర్‌తో వరవ కాలువలోని మట్టిని తొలగించడంతో మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం తొలగింది.

ట్రాఫిక్ సమస్యతో ప్రజలు, వాహనదారుల అవస్థలు

కావలి,సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సినిమాహాల్ రోడ్డులోని పెండెంవారి వీధిలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అక్కడ ఉన్న హోల్‌సేల్ దుకాణాల కారణంగా వేళాపాళలు లేకుండా లారీలకు లోడింగ్ అన్‌లోడింగ్ జరుగుతుండటంతో నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోతోంది. శనివారం ఉదయం సినిమాహాల్ రోడ్డులో నుంచి పెండెం వారి వీధిలోకి ఒక లారీ రివర్స్ అవుతున్న సమయంలో అక్కడ ఇరుక్కుని సుమారు గంట సేపు ట్రాఫిక్ స్తంభించింది. అసలే రోడ్డు ఇరుకుగా ఉండటం దాని ముందే ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినా ట్రాఫిక్ స్తంభిస్తోంది. వాస్తవంగా కావలి పట్టణంలో ఉదయం 8గంటల లోపు రాత్రి 10 గంటల తర్వాత మాత్రమే లోడింగ్ అన్‌లోడింగ్ లారీలను అనుమతించాలి. కానీ పోలీసులు పగటిపూట లోడింగ్ అన్‌లోడింగ్ జరుగుతున్న వాహనాలను కట్టడి చేయలేక పోతున్నారు. దీంతో అక్కడ నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుండటంతో ప్రజలు వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పగటి పూట లోడింగ్, అన్‌లోడింగ్ వాహనాలను కట్టడి చేయాలని ప్రజలు పోలీసులను కోరుతున్నారు.



సినిమా హాల్ రోడ్డులో లారీ ఇరుక్కుని స్తంభించిన ట్రాఫిక్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



వీవీపాలెం : మొక్క నాటుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత



కొండాపురం : మొక్క నాటుతున్న ఎంపీడీవో, కమిషనర్ తదితరులు



కావలి టౌన్ : మొక్క నాటుతున్న అధ్యాపకులు విద్యార్థులు

అల్లూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అల్లూరు ఎంపీడీవో రజనీకాంత్ అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణ పరిధిలో కమిషనర్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ విద్యాసంస్థల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి, సచివాలయాల ఆవరణలు, ప్రభుత్వ లేఅవుట్లలో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, డిడిఓ వరప్రసాద్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులను దూరం చేయవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని కాకుటూరులో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిశుభ్రత పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యాయురాలు సుకన్య, కార్యకర్తలు హైమావతి, వేంకటేశ్వరమ్మ, రమాదేవి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆదినారాయణ అన్నారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో బాగంగా శనివారం మండలంలోని గుడవళ్లూరు పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, గ్రామస్థులతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు లలులలలలలలనాటారు. ఈకార్యక్రమంలో ఎంఈవో-1 కె.రవికుమార్, మండలపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పీ.చంద్రబాబునాయుడు, పీ. రమేష్, సర్పంచ్ మాచర్ల, ప్రధానోపాధ్యాయుడు వి.రాధాక్రిష్ణ, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

కావలి (టౌన్) : జేబీ డిగ్రీ కళాశాలలో శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు. కావలి ఫారెస్ట్ డివిజనల్ అధికారిణి అరుణ సౌజన్యంతో కళాశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం నాయుడు, స్వయం ఉపాధి కోర్సుల డైరెక్టర్ ఆర్ మాల్యాద్రి అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కలిగిరి : స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని నాగసముద్రం సచివాలయ ఆవరణలో సర్పంచ్ డమ్ము శ్రీనివాసులు ఆధ్వర్యాన మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీఓ వెలుగోటి మధు మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా మానవాళి మనుగడకు చెట్లు అవసరమని ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి సురేష్, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన నీటి సరఫరాకు చర్యలు

- రూ. 2.50 లక్షలతో మోటార్లు, ప్యానెల్ బోర్డు, సిలిండరు కొనుగోలు
- ఏఈఈ రాజశేఖర్ ఆధ్వర్యంలో మరమ్మతులు

లింగసముద్రం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రాళ్లపాడు ప్రాజెక్టులో నీరు అడుగంటిపోయింది. పచ్చ రంగులో కలుషితమైన నీరు మంచినీటి పథకాల ద్వారా సరఫరా అవుతుండడంతో ప్రజల నుండి తీవ్ర విమర్శలు వ్యక్తమైన విషయం తెలిసిందే. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కలుషిత తాగునీటికి సంబంధించిన వార్తకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్పందించారు. ప్రజలకు పరిశుభ్రమైన నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కందుకూరు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. దీంతో కందుకూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ నవకిశోర్ ఆదేశాల మేరకు శనివారం మండల ఏఈఈ సీహెచ్ రాజశేఖర్, రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకాన్ని సందర్శించారు. 1 హెచ్‌పీ మోటార్లు 4, ప్యానెల్ బోర్డులు, వైరింగ్, స్విచ్ బోర్డులు కొత్తవి ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న 100 కేజీల గ్యాస్ సిలెండరు స్థానంలో 900 కేజీల నూతన గ్యాస్ సిలెండరును ఏర్పాటు చేశారు. దాని నుండి 2 పాయింట్ల బదులు 4 పాయింట్ల గ్యాస్‌ను విడుదల చేసి క్లోరినేషన్ చేయించారు. సెలిమెంటేషన్ ట్యాంకులో చక్రానికి మరమ్మతులు చేయించి నీటిలో ఆటలంను కలిపారు. అనంతరం తాగునీటిని సరఫరా చేశారు. ఇందుకు సుమారు రూ.2.50 లక్షలు ఖర్చు అయిందని, ప్రస్తుతం 50 శాతం తాగునీరు శుభ్రంగా వస్తున్నట్లు ఏఈ రాజశేఖర్ చెప్పారు. వాటర్ ప్లాంటులోని ఫిల్టర్ బెడ్‌లను శుభ్రం చేసి, వారం రోజుల లోపు వంద శాతం పరిశుభ్రమైన నీరు అందిస్తామన్నారు. ఏఈఈ వెంట మంచినీటి పథకం నిర్వహకులు అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.



కలుషిత నీటి బాటిళ్లను చూపిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ రాజశేఖర్

రూ. 3 కోట్ల సబ్ ప్లాన్ నిధుల విడుదల

కందుకూరు,సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కాలనీల్లో అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం కందుకూరు నియోజకవర్గానికి రూ. 3 కోట్ల సబ్ ప్లాన్ నిధులు విడుదల చేసిందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన కందుకూరులో విలేకరులతో మాట్లాడారు. ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టి ఎస్సీ కాలనీల రూపురేఖలు మారుస్తామన్నారు. రోడ్లు, కాలువలు వంటి మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ కాలనీలకు నిధులు కేటాయించకుండా కేవలం నినాదాలతో సరిపుచ్చిందని విమర్శించారు. కందుకూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు రోడ్ల విస్తరణ, సెంట్రల్ డివైడర్ల ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. అధునాతన యంత్రాలతో ఏ రోజు చెత్తను ఆ రోజే రీసైక్లింగ్ చేస్తారని ఎమ్మెల్యే తెలిపారు.



నూతన కంపాక్టర్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

మొక్కల పెంపకాన్ని ప్రతీ పౌరుడు బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. పట్టణంలోని క్లబ్ రోడ్డులో శనివారం ఉదయం 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజలంతా పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనాలని, 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ ఏపీగా మార్చాలన్న సీఎం చంద్రబాబు సంకల్పానికి మద్దతుగా నిలవాలని కోరారు. అనంతరం అర్బన్ హెల్త్‌సెంటర్‌లో 'స్వస్థ్ నారి - స్వశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ రోడ్డులో రూ. 18 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె అనూష, వైద్యాధికారులు బ్యూలాగ్రేస్, స్టెల్లా కారుణ్య, రమాప్రియ, ధర్మతేజ, బీజేపీ నాయకులు జీ. హరిబాబు, ఎం. వరప్రసాదరావు, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, పోకూరి రాంబాబు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, కంచ్రా మాల్యాద్రి, కొడాలి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చెత్త తరలింపు వాహనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

కందుకూరు మున్సిపాలిటీలో చెత్త తరలింపు కోసం రూ. 1.16 కోట్లతో నూతనంగా కొనుగోలు చేసిన కంపాక్టర్ వాహనాన్ని శనివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మున్సిపల్ కార్యాలయంలో ప్రారంభించారు. పట్టణంలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ప్రజల సహకారంతో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామన్నారు. కందుకూరు మున్సిపాలిటీలోని పలు వార్డు సచివాలయాల్లో పనిచేస్తూ ఇటీవల డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన పలువురిని ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ అనూష, మున్సిపల్ మాజీవైస్ ఛైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మంచి ఆహారపు అలవాట్లతోనే ఆరోగ్యం



పోషకాహారం గురించి వివరిస్తున్న సీడీపీవో

కలిగిరి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉంటే ఆరోగ్యంగా ఉండవచ్చని సీడీపీఓ పద్మజా కుమారి పేర్కొన్నారు. మండలంలోని పెద అన్నలూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ మాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యదశ నుండి చిన్నారుల ఆరోగ్య రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్థూలకాయ నివారణ తదితర అంశాలపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు మహేశ్వరరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పీ విజయలక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్త పి సునీత తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ కమిటీ ఎన్నిక

వలేటివారిపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీఐటీయూ మండల కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా సాధు చెన్నకేశవులు కో కన్వీనర్‌గా మిట్టనోసల సుబాను ఎంపికయ్యారు. అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో చెన్నకేశవులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం శాసనసభలో కార్మికుల పనిగంటలను 8 నుండి 13 గంటలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయం వల్ల కార్మికులపై తీవ్రమైన పనిభారం పడుతుందన్నారు.

కొనసాగిన డాక్యుమెంట్ రైటర్స్ నిరసన

కావలి,సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్లలో పాత విధానం కొనసాగించాలని కోరుతూ కావలిలో శనివారం డాక్యుమెంట్ రైటర్స్, స్టాంప్ వెండర్స్ పెన్‌డౌన్ చేసి నిరసన వ్యక్తంచేశారు. ఎలాంటి డాక్యుమెంట్లు రాయకుండా, స్టాంప్‌లు ఇవ్వకుండా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కూర్చుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చలంచర్ల నాగరాజు, పీడీఎం ప్రసాద్, స్టాంప్ వెండర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషయ్య, డాక్యుమెంట్ రైటర్స్, స్టాంప్ వెండర్స్ తదితరులు పాల్గొన్నారు.



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ముందు కూర్చుని నిరసన తెలుపుతున్న డాక్యుమెంట్ రైటర్స్, స్టాంప్ వెండర్స్

విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యం

కొండాపురం, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యం అని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషిచేయాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్ బాబు పేర్కొన్నారు. మండలంలో శనివారం జరిగిన క్లస్టర్ సమావేశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు నిరంతరం కృషిచేయాలన్నారు. క్లస్టర్ సమావేశాల ద్వారా ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలను మెరుగుపరచుకునేందుకు ఆన్‌లైన్లో శిక్షణ ఇస్తామన్నారు. మండలకేంద్రంలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలతోపాటు సాయిపేట దామా చినబాబు మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ సమావేశాలను తనిఖీచేసిన ఆయన ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అలాగే స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో ఎంఈవో-1 కె రవికుమార్, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు వీ రాధాక్రిష్ణ, ఐ.రామమోహన్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఖాదర్ బాష తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్ బాబు

విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు

కావలి (టౌన్), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని ఎమ్మెల్యే డీ. కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని శాంతినగర్‌లోని ప్రైవేట్ పాఠశాల సమావేశ మందిరంలో ఏబీవీపీ విభాగ్ అభ్యాస వర్గ్ సమావేశం అనంతరం శోభాయాత్ర జరిగింది. ఏబీవీపీ జిల్లా ప్రముఖ్ గంగాధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏబీవీపీ క్రమశిక్షణ, దేశభక్తికి మారుపేరన్నారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు రాము, కావలి ఏఎంసీ ఛైర్‌పర్సన్ పి అలేఖ్య, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వినయ్, మహిళా కన్వీనర్ డింపుల్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు భరత్, నాయకులు రత్నం, దామోదర్‌నాయుడు, బ్రహ్మానందం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



కావలిలో ఏబీవీపీ శోభాయాత్ర

యాక్సెస్ బ్యాంకు ఆలోచన విరమించుకోవాలి

కావలి,సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల బ్యాంకు ఖాతాలన్నీ యాక్సెస్ బ్యాంకులోనే పెట్టాలన్న ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు తెలిపారు. ఈమేరకు శనివారం కావలి మున్సిపల్ కమిషనర్‌కు స్థానిక యూనియన్ నాయకులతో కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు మాట్లాడుతూ ప్రయివేట్ కార్మికులకు జిల్లాకలెక్టర్ నూతనంగా విడుదల చేసిన జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మల్లె అంకయ్య, టీ. వెంకటేష్, వై. నారాయణ, పీ. సుబ్బరాయుడు, బీ. శ్రీను, గుర్రం వేణు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తదితరులు

పోరుబాటకు టీచర్లు సిద్ధం కావాలి

కావలి (టౌన్) సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరగనున్న పోరుబాటకు ఉపాధ్యాయులు సమాయత్తం కావాలని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ కంచర్ల మధుసూదన్‌రావు పిలుపునిచ్చారు. శనివారం పట్టణ వెంగళరావునగర్‌లోని మున్సిపల్ హైస్కూల్‌లో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కలిసి కరపత్రాలు, గోడపత్రికలు ఆవిష్కరించారు. మధుసూదన్‌రావు మాట్లాడుతూ అక్టోబరు 7న విజయవాడ ధర్నా చౌక్‌లో జరగనున్న ఉపాధ్యాయుల ధర్నా కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నేతలు ఎస్‌కె ముజీబ్, ఐహెచ్‌ఎల్ ప్రసాద్, వి వెంకటేశ్వర్లు, ఎ మంజువాణి తదితర ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించాలి

లింగసముద్రం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా మానిటరింగ్ అధికారి బి సుధీర్‌బాబు పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని పెదపవని జడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలను తనిఖీ చేశారు. ఎఫ్ఎల్ఎన్‌ను ఉపయోగించి బోధించాలన్నారు. సమావేశాలలో నేర్చుకున్న అంశాలతో విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో కొండాపురం ఎంఈవో కె రవి కుమార్, ప్రధానోపాధ్యాయులు టి శ్రీనివాసులు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీకాతో పశుసంపదను కాపాడుకోవాలి

వలేటివారిపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పశువులకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న గాలికుంటు వ్యాధి నివారణా టీకాలు వేయించి, పశుసంపదను కాపాడుకోవాలని మాజీ ఎంపీటీసీ పొడపాటి నరసింహం తెలిపారు. మండలంలోని బడేవారిపాలెం, చుండి, కాకర్లపాలెం గ్రామాల్లో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణా టీకాలు వేశారు. బడేవారిపాలెంలో పశువులకు ఆయన టీకా వేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోకూరు పశువైద్యాదికారి సుధాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కావలిలో బిహార్ వాసి మృతి

కావలి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం మద్దూరుపాడు లక్ష్మీట్రేడర్స్ రైస్‌మిల్లు వద్ద శుక్రవారం రాత్రి బిహారు రాష్ట్రం ఈస్ట్ చంప్రాన్ జిల్లా చందాలి గ్రామానికి చెందిన రంజిత్‌కుమార్ యాదవ్ (32) మృతి చెందారు. రంజిత్‌కుమార్ తన బంధువులైన ఉమాశంకర్, గౌరీ శంకర్, కుమార్, చందూజీలతో కలిసి మిర్యాలగూడకు చెందిన మాధవరావు లారీలకు డ్రైవర్లగా, హెల్పర్లగా పనిచేస్తుంటారు. ఆ లారీలు తెలంగాణా, ఆంధ్రలో రైస్‌మిల్లుల నుంచి వరి పొట్టు తీసుకుని క్రిష్ణపట్నం పోర్టుకు తీసుకెళుతుంటాయి. ఈనేపథ్యంలో శుక్రవారం వరి పొట్టుకోసం మద్దూరుపాడు రైస్ మిల్లు వద్దకు రాగా లారీ దగ్గర రంజిత్‌కుమార్ యాదవ్ కింద పడి ఉండటంతో ఆయనను వెంటనే కావలి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. గుండెపోటుతో మృతి చెందాడా లేక ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడా అనే అనుమానంతో మృతదేహాన్ని శనివారం కావలి ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి రూరల్ ఎస్ఐ తిరుమలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● 157 దేశాల నోట్లు

● పదేళ్లలో 200 కోట్లు

శ్రీవారి హుండీలో విదేశీ కరెన్సీ



■ ఆదివారం ప్రత్యేకం

తృణమో పణమో అయినా స్వామికి హుండీలో సమర్పించుకోకుండా తిరుమల కొండకు వచ్చిన భక్తులెవరూ తిరుగు ప్రయాణం కారు. అట్లా శ్రీనివాసుడికి నగదూ, నాణేలూ, ఆభరణాలతో పాటు భూములు, భవనాల పత్రాలు కూడా హుండీ ద్వారా లభిస్తుంటాయి. హుండీ అనేది డబ్బు సేకరణకు సాధనం కాదు. భక్తికి ప్రతీక. దేశదేశాల నుంచి వచ్చే భక్తులు తమ దేశాల కరెన్సీనీ, నాణేలనూ హుండీలో వేస్తుంటారు. ప్రపంచంలో 197 దేశాలుంటే 157 దేశాల కరెన్సీ శ్రీవారి హుండీలో లభించింది. 2015 నుంచి 2025 మార్చి వరకు ఉన్న రికార్డుల ఆధారంగా చూస్తే రూ.201,65,97,829 విదేశీ కాయిన్స్, నోట్లు అందాయి. గడిచిన పదేళ్లలో ఏడాదికి సగటున రూ.20.16 కోట్లు విదేశీ సొమ్ములు స్వామి ఖజానాకు అందుతున్నాయి. విదేశీ కరెన్సీని వేలం ద్వారా మనీ చేంజర్స్‌కి అందజేసి స్వదేశీ కరెన్సీగా టీటీడీ మార్చుకుంటుంది. 2003 వరకు బరువు ప్రాదిపదికన నాణేల విక్రయం జరిగేది. ఆ తర్వాత వాటి విలువ ఆధారంగా మార్పిడి జరుగుతోంది. ఎఫ్‌సీఆర్ఏ మార్గదర్శకాల ప్రకారం తిరుమల ఎస్‌బీఐ బ్రాంచ్ నుంచి న్యూఢిల్లీలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో విదేశీ కరెన్సీని, నాణేలనూ జమ చేస్తున్నారు. రెండేళ్ల కిందట టీటీడీ ఎఫ్‌సీఆర్ఏ(ఫారెన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్) నిబంధనలను ఉల్లంఘించిందనే వివాదం కూడా నడిచింది. విరాళాలు ఇచ్చే దాతల వివరాలు తెలియజేయడం లేదనే రిపోర్టు ఆధారంగా టీటీడీకి జరిమానా కూడా విధించారు. అయితే హుండీలో సమర్పించే కానుకలు కావడంతో ఈ విరాళాలను 'శ్రీవారికి సమర్పించే కానుకలు'గా పరిగణిస్తూ దాతల వివరాలను తెలియజేయాల్సిన అవసరం లేదంటూ యాక్ట్ నుంచి మినహాయింపు లభించింది.

- ఆంధ్రజ్యోతి, తిరుమల



- 2007 వరకు కూడా కేవలం 15 నుంచి 30లోపు దేశాలకు సంబంధించిన కరెన్సీ మాత్రమే పరకామణి లెక్కింపులో కనిపించేది. ఆ తర్వాతే ఇతర దేశాలకు సంబంధించి కాయిన్స్‌తో పాటు నోట్లు అధికంగా రావడం మొదలయ్యాయి. 2010 వరకు ఉన్న లెక్కలను పరిశీలిస్తే సింగపూర్, అమెరికా డాలర్లు, యూరో సెంట్లు, బ్రిటిష్ పౌండ్లు, మలేషియా, ఆస్ట్రేలియా, కెనడా, దక్షిణాఫ్రికా, శ్రీలంక దేశాల నగదు అధికంగా ఉండేవి. ఆ తర్వాత అనేక దేశాలకు సంబంధించిన కరెన్సీ కానుకలుగా రావడం పెరిగిపోయింది. అమెరికా, మలేషియా, సింగపూర్‌తో పాటు యూఏఈ దేశాల కరెన్సీ అధికంగా ఉంటోంది.
- స్వామి హుండీలో పాకిస్తాన్ కరెన్సీ కూడా కనిపిస్తూ ఉంటుంది.
- 2004లో 10 టన్నుల విదేశీ నాణేలను టీటీడీ విక్రయించి దాదాపు రూ.కోటి ఆదాయాన్ని పొందింది. అందులో 80 వేల సింగపూర్ డాలర్లు, 1.6 లక్షల అమెరికన్ డాలర్లు, 3 వేల యూరో సెంట్లు, 35 వేల బ్రిటిష్ పౌండ్లు, 8 లక్షల మలేషియన్ రింగెట్లు, 4 వేల ఆస్ట్రేలియన్ డాలర్లు, వెయ్యి దక్షిణాఫ్రికా రాండ్లు, 15వేల కెనిడియన్ సెంట్లు, 10 వేల లంకన్ రూపాయలు ఉన్నాయి.
- 2007 డిసెంబరు నెల చివరి వారంలో ఆరు రోజుల్లో దాదాపు 14 దేశాలకు చెందిన కరెన్సీ హుండీలో చేరింది.
- 2016లో హుండీ ద్వారా విదేశీ కరెన్సీ 50.63 కోట్లు లభించింది.
- 2015లో రూ.44.81 కోట్లు ఇతర దేశాల కరెన్సీ లభించింది.
- 2020-21 కరోనా సమయంలోనూ స్వామి హుండీలో రూ.1.92 కోట్లు ఇతర దేశాల నగదు చేరడం విశేషం.

కంబైన్డ్ నోటిఫికేషన్ తుది జాబితా విడుదల

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించి ఎస్వీ వైద్య కళాశాల, రుయాస్పత్రి, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, రుయాస్పత్రిలోని స్కూల్ ఆఫ్ నర్సింగ్, శ్రీపద్మావతమ్మ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల పరిధిలో పోస్టుల భర్తీకి సంబంధించి గతంలో విడుదల చేసిన కంబైన్డ్ నోటిఫికేషన్ తుది జాబితాను విడుదల చేసినట్లు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 26 సాయంత్రం 5 గంటల్లోపు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ప్రిన్సిపాల్ కార్యాలయంలో వ్యక్తిగతంగా సమర్పించాలని తెలిపారు.









శోభాయమానంగా తిరుమల కొండ

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలతో తిరుమల కొండ శోభాయమానంగా దర్శనమిస్తోంది. రూ.5.50 కోట్లతో విద్యుద్దీపాలంకరణ చేపట్టడంతో నూతన అందాలతో స్వామి క్షేత్రం కనువిందు చేస్తోంది. శ్రీవారి గర్భాలయం నుంచి మహద్వారం వరకు, ప్రాకారం, గోపురం, మాడవీధుల్లోని ముఖ్యమైన భవనాలకు రంగురంగు లైట్లతో విద్యుత్ అలంకరణలు చేశారు. ప్రధాన కూడళ్లలోనూ విద్యుత్ తీగలతో పాటు వివిధ దేవతామూర్తుల భారీ కటౌట్లు, లైట్లతో కూడిన ప్లాస్టిక్ చెట్లు, సప్తద్వారాలు ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

మళ్లీ తెరపైకి పరకామణి కుంభకోణం

● అప్పటి అధికారుల గుండెల్లో గుబులు ● సీఐడీ చేతికి పరకామణి దొంగతనం కేసు

తిరుమల, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయ పరకామణి కుంభకోణం మళ్లీ తెరపైకి వచ్చింది. లోక్‌అదాలత్‌లో రాజీ కుదిర్చిన కేసును సీబీసీఐడీకి అప్పగిస్తూ ఏపీ హైకోర్టు ఆదేశాలివ్వడంతో అప్పటి అధికారులు, పాలకుల గుండెల్లో గుబులు మొదలైంది.

విజిలెన్స్ అధికారి ఫిర్యాదుతో వెలుగులోకి..

శ్రీవారి ఆలయంలోని హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించే పరకామణిలో టీటీడీ అధికారులు, సిబ్బందితోపాటు సేవకులు విధులు నిర్వహించి రికార్డుల్లో నమోదు చేస్తారు. ఈ ప్రక్రియ మొత్తం సీసీ కెమెరాల నిఘాలోనే జరుగుతుంది. వీటిని ఎప్పటికప్పుడు విజిలెన్స్ అధికారులు పర్యవేక్షిస్తుంటారు. ఈ లెక్కింపులో పెద్దజీయర్ మఠం నుంచి కూడా ఓ వ్యక్తి పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. అయితే 2023 ఏప్రిల్ 29వ తేదీన సాయంత్రం 4 గంటల సమయంలో మఠం నుంచి వచ్చిన రవికుమార్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా వ్యవహరిస్తున్నాడని గుర్తించిన చంద్ర అనే సెక్యూరిటీ గార్డు అప్పటి విజిలెన్స్ ఏవీఎస్వో సతీష్‌కుమార్‌కు సమాచారమిచ్చాడు. దీంతో ఏవీఎస్వోతోపాటు వీఐ సుబ్బరాజు కలిసి రవికుమార్‌ను తనిఖీ చేయగా విదేశీ కరెన్సీని దాచినట్లు గుర్తించారు. 100 డాలర్ల తొమ్మిది నోట్లు(రూ.72 వేలు) ఉన్నట్టు గుర్తించారు. తాను 30 ఏళ్లుగా పెద్దజీయర్ మఠంలో పనిచేస్తున్నానని, గతంలో ఎప్పుడూ తాను ఇలాంటి తప్పులు చేయలేదని రవికుమార్ చెప్పుకొచ్చాడు. ఈ మేరకు నివేదికను తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు సమర్పించగా 379, 381 ఐపీసీ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

లోక్ అదాలత్ తీర్పుపై బ్రేక్

2023లో నమోదైన ఈ కేసుపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. అనేక వ్యవస్థలు ఉన్న క్రమంలో తప్పుచేసిన వారికి శిక్ష వేయకుండా రాజీ కుదర్చడానికి వీరెవరు అంటూ పలు రాజకీయ పార్టీలు, హిందూ సంఘాలు, భక్తుల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి.దాదాపు రూ.200 కోట్లకుపైగా స్వామి సొమ్మును అపహరించిన వ్యక్తిని కేసు నుంచి తప్పించే అధికారం వీరికి ఎవరు ఇచ్చారంటూ మండిపడ్డారు. ఈ కేసుపై విచారణ చేపట్టాలంటూ బీజేపీ నేత, ప్రస్తుత బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి కూడా 2024లో ధర్మకర్తల మండలికి ఫిర్యాదు కూడా చేశారు. అయితే తిరుపతికి చెందిన ఎం.శ్రీనివాసులు పరకామణి వ్యవహారంపై సీఐడీ ద్వారా విచారణ చేయించాలంటూ వేసిన పిటిషన్ ఆధారంగా శుక్రవారం కేసు విచారణకు వచ్చింది. కౌంటర్‌కు రెండు వారాల గడువు ఇస్తూ లోక్ అదాలత్‌లో ఇచ్చిన ఆదేశాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తీర్పునిచ్చింది. ముఖ్యంగా కేసును సీబీసీఐడీకి అప్పగిస్తూ నిర్ణయం తీసుకోవడంతో తిరిగి పరకామణి కుంభకోణం తెరపైకి వచ్చింది. ఈ క్రమంలో అప్పటి పాలకులు, అధికారులు, సిబ్బంది గుండెల్లో గుబులు మొదలైనట్టు తెలుస్తోంది.మరోవైపు రాజకీయంగానూ ఈ వ్యవహారం వేడిని పుట్టిస్తోంది. విమర్శలు, ప్రతి విమర్శలు మొదలయ్యాయి.

పోలీస్ ఒత్తిడితో రాజీ

టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి 2024 జనవరిలో మండలిలో ఈ కేసు గురించి మాట్లాడుతూ పరకామణి నుంచి దాదాపు రూ.వంద కోట్లు దొంగతనం చేశారని, ఆయన్ను ఉద్దేశపూర్వకంగా కేసు నుంచి తప్పించారని వ్యాఖ్యానించడం తీవ్రస్థాయి చర్చనీయాశమైంది. ఈ క్రమంలో టీటీడీ విజిలెన్స్ వింగ్ అధికారులు ఈ వ్యవహారంపై మరోసారి విచారణ చేపట్టి 2024 జూలైలో నివేదిక సమర్పించారు. ఆ నివేదికలో 2023 మే 30వ తేదీన తిరుపతి అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలా చేయబడిందని పేర్కొన్నారు. తిరుపతి, చెన్నైలో రవికుమార్‌తో పాటు అతని సతీమణి పేరుపై ఉన్న ఏడు ఆస్తులను టీటీడీ విరాళంగా ఇచ్చారని, వాటి రిజిస్ట్రేషన్ పత్రాలను టీటీడీకి అందజేశారని వింగ్ అధికారులు నివేదించారు. కాగా, 2023 సెప్టెంబరు 9వ తేదీన ఏవీఎస్వో సతీష్‌తో పాటు రవికుమార్ కలిసి రాజీకి వచ్చామని కోర్టుకు తెలిపారని, ఈ క్రమంలో ఈ కేసును లోక్‌అదాలత్ కొట్టివేసిందని, అందుకే రవికుమార్‌కు శిక్ష పడలేదని వింగ్ స్పష్టం చేసింది. అయితే అప్పటి పోలీసు అధికారుల ఒత్తిడితో ఈ రాజీ ఒప్పందం జరిగిందని, పోలీసులు ఎందుకు ఇలాంటి ఒత్తిడి తీసుకువచ్చారో తనకు తెలీదంటూ ఏవీఎస్వో సతీష్ కుమార్ రాతపూర్వకంగా ఇచ్చినట్టు విజిలెన్స్ వింగ్ అధికారులు నివేదికలో పేర్కొన్నారు. ఈ ఆస్తుల ధర దాదాపు రూ.40 కోట్లు ఉండవచ్చని అధికారుల అంచనా.

స్విమ్స్‌లో అల్లైడ్ హెల్త్‌సైన్సెస్ కోర్సులకు మూడో విడత కౌన్సెలింగ్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ పరిధిలోని శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాలలో బీఎస్సీ నర్సింగ్, బీపీటీ, బీఎస్సీ అల్లైడ్ హెల్త్‌సైన్సెస్ కోర్సులకు సంబంధించి మిగిలిన సీట్లకు చివరిసారిగా మూడో విడత ఆఫ్‌లైన్ విధానం ద్వారా ఈ నెల 26న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే హాజరుకాలని వెల్లడించారు. ఈ సీట్లను ఏపీ ఎంసెట్-2025 ర్యాంకుల ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు లోబడి భర్తీ చేస్తారని వివరించారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 26న ఉదయం 8.30 గంటలకు కళాశాలలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆమె పేర్కొన్నారు.

స్వర్ణనారావారిపల్లె ప్రాజెక్టుకు స్కోచ్ పురస్కారం

● అవార్డు అందుకున్న కలెక్టర్ వెంకటేశ్వర్



అవార్డు అందుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్),సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): స్వర్ణనారావారిపల్లి ప్రాజెక్టులో భాగంగా 45 రోజుల్లో 1,600 ఇళ్లకు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసినందుకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన స్కోచ్ పురస్కారం లభించింది. ఢిల్లీలోని ఇండియా హాబిటాట్ కన్వెన్షన్‌లో శనివారం ఈ అవార్డును ఏపీఎస్పీడీసీఎల్ సీఈ సురేంద్రనాయుడితో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ అందుకున్నారు. గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో రూ.20.68కోట్లతో ఎ.రంగంపేట, కందులవారిపల్లి, చిన్నరామాపురం గ్రామ పంచాయతీల్లోని 1,600 గృహాలకు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, జిల్లా యంత్రాంగం సహకారంతోనే ఇది సాధ్యమైందని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, జేసీ శుభం బన్సల్, స్వర్ణనారావారిపల్లి స్పెషల్ ఆఫీసర్ సుశీలాదేవి, ఇతర అధికారులు కలెక్టర్‌కు అభినందలు తెలిపారు.

ఈ రోగానికి మందేది?

● స్విమ్స్ జనరిక్ షాపులో బ్రాండెడ్ మందులు

6



శ్రీవారికి కానుకగా ఎలక్ట్రిక్ బైక్



హైదరాబాద్‌కు చెందిన బిగాస్ ఆటో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శనివారం రూ.1.10 లక్షల విలువైన బిగాస్ ఎలక్ట్రిక్ బైక్‌ను తిరుమల శ్రీవారికి కానుకగా అందజేసింది. టీటీడీ ఏఈవో మోహన్‌రాజుకు సంస్థ ఆర్ ఎస్‌ఎం రామారావు బైక్ తాళాలను అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

'ఓజీ' పెద్ద హిట్ కావాలి



● నిర్మాత డీవీవీ దానయ్య

ఈనెల 25న విడుదల కానున్న పవన్‌కల్యాణ్ నటించిన 'ఓజీ' సినిమా పెద్ద హిట్ కావాలని శ్రీవేంకటేశ్వరస్వామిని కోరానని ఆ చిత్ర నిర్మాత డీవీవీ దానయ్య తెలిపారు. తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. కాగా శనివారం శ్రీవారిని ఉడిపిలోని పాలిమారు మఠాధిపతి విద్యాధీశ తీర్థ స్వామిజీ, ఢిల్లీ ఏపీ ప్రభుత్వ సలహాదారు ఆర్పీ ఠాకూర్ దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తమిళ జాలర్ల బోటు పట్టివేత

వాకాడు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాసపురం సముద్ర తీరంలో అక్రమంగా వేట సాగిస్తున్న తమిళనాడు ప్రాంతానికి చెందిన కరైకల్ జాలర్ల స్పీడ్ బోట్‌ను శుక్రవారం రాత్రి మత్స్యకారులు పట్టుకున్నారు. తమిళనాడు రాష్ట్రం కరైకల్ ప్రాంతానికి చెందిన 16 మంది మత్స్యకారులు శ్రీనివాసపురం సముద్రతీరంలో చేపలను వేటాడుతుండగా స్థానిక జాలర్లు అడ్డుకుని బోట్‌ను అదుపులోకి తీసుకున్నారు. బోట్‌ను నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె పోర్టులో అప్పజెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపి చెన్నై రాష్ట్రానికి చెందిన స్పీడ్ బోట్ ఆంధ్రా తీరం వైపు రాకుండా చూడాలని కోరారు.

సర్వ దర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.4.04 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 71,249

తలనీలాలు సమర్పించినవారు: 22,901


● బ్రాండెడ్ షాపులోనూ నాణ్యత లేని మందులే
● తనిఖీల్లో వెల్లడైనా చర్యలు తీసుకోని టీటీడీ
● వైసీపీ హయాంలో మొదలై నేటికీ కొనసాగుతున్న అక్రమాలు

ఈ రోగానికి మందేది?

● స్విమ్స్ జనరిక్ షాపులో బ్రాండెడ్ మందులు



తిరుపతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్ ఆవరణలో మందుల మాయాజాలం నడుస్తోంది. బ్రాండెడ్ మందులు మాత్రమే విక్రయించాల్సిన షాపులో జనరిక్ మందులు, జన ఔషధి షాపులో బ్రాండెడ్ కంపెనీల మందుల విక్రయం జరుగుతోంది. ప్రిస్క్రిప్షన్‌లో రాసిన మందులకు బదులు నాసిరకం అంటగడుతున్నారు. వైద్య బృందాల తనిఖీలో మందుల బాగోతం తేలినా టీటీడీ చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. గత వైసీపీ ప్రభుత్వంలో కీలక నేతల మద్దతుతో మొదలైన మందుల షాపుల అక్రమాలు ప్రభుత్వం మారినా కొనసాగుతుండడం విమర్శలకు దారితీస్తోంది.



స్విమ్స్‌లో ఇన్నోవేటివ్ ఫార్మా మందుల షాపులో క్వాలిటీ చెక్,రీ చెక్ చేసినా తప్పిదాలు సరిదిద్దుకోలేదని వైద్యుల బృందం ఇచ్చిన నివేదిక

ఇన్నోవేటివ్‌గా దోపిడీ!

స్విమ్స్ ఆవరణలో గతేడాది డిసెంబరులో ఇన్నోవేటివ్ ఫార్మాసూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట ఓ మందుల షాపు వెలిసింది. కేటగిరీ పరంగా ఇందులో బ్రాండెడ్ కంపెనీల మందులు విక్రయించాలి. ఈ షాపు నెలవారీ అద్దె రూ.31 లక్షలంటే వ్యాపార స్థాయి ఊహించవచ్చు. అధిక ఖరీదు కలిగిన మందులు విక్రయిస్తున్నా చాలామటుకు నాసిరకమనే ఆరోపణలున్నాయి. ఈనెల 6వ తేదీన బక్కయ్య(64) అనే రోగికి వైద్యులు నాలుగు రకాల మందులు రాశారు. అందులో ఎకోస్ప్రిన్ మాత్రల బదులు నాణ్యత లేని ఎకోప్రిల్ విక్రయించారు. స్ట్రోక్ వస్తే మెదడులో రక్తం గడ్డ కట్టకుండా ఉండడానికి ఈ మాత్ర ఉపకరిస్తుంది. నాసిరకం మాత్రల వల్ల అనర్థం సంభవించే ప్రమాదముంది. ముపిరోసిన్ అనే ఆయింట్‌మెంట్ బదులు టీ.మ్యూస్ క్రీమ్ అనే నాసిరకం విక్రయించారు. స్టిలోజ్ ట్యాబ్‌లెట్ రాస్తే నాణ్యత లేని సిలోబాక్ట్ ఇచ్చారు. ట్రీటెల్ మాత్ర బదులు పెరిటాల్ అనే నాసిరకం మాత్ర ఇచ్చారు. గుండె, కిడ్నీ సంబంధ సమస్యలు ఎదుర్కొంటున్న కె.జయమ్మకు కూడా వైద్యులు రాసిన నాణ్యమైన మందులకు బదులు నాణ్యతలేని మందులు ఇచ్చారు. దీంతో ఆరోగ్యం క్షీణించి ఆమె ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరింది. వైద్యుల ద్వారా నిర్ధారించుకున్న జయమ్మ కుటుంబీకులు గత నెల 22న స్విమ్స్‌కు ఫిర్యాదు చేశారు. గతంలోనూ ఈ షాపుపై అనేక ఫిర్యాదులు వచ్చాయి.

రెండవ తనిఖీలోనూ అవే తప్పిదాలు

వైద్యుల బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఉన్నతాధికారులు నోటీసులు జారీ చేసినా ఈ షాపుపై ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి.దీంతో రెండోసారి అంటే మే 9న వైద్యుల బృందం మళ్లీ తనిఖీ చేసింది.మునుపు గుర్తించిన తప్పిదాలను సరిదిద్దుకోలేదని తేల్చింది. అదనంగా మరిన్ని ఉల్లంఘనలు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చింది.. అయినా ఈ దుకాణంపై చర్యలు తీసుకోలేదు.



స్విమ్స్ జన ఔషధి షాపులో తనిఖీలు చేపట్టి అక్రమాలపై వైద్యుల బృందం ఇచ్చిన నివేదిక

5 శాతమే జనరిక్ మందులు

స్విమ్స్ ఆవరణలో ఓపీడీ బ్లాకు వద్ద వెలుపల బర్డ్ భవనంలో పీఎంబీజేకే పథకం కింద ఈ ఏడాది జూన్‌లో జన ఔషధి షాపు ఏర్పాటైంది. దీని నెలవారీ అద్దె రూ.5 లక్షలు. ఇందులో 90 శాతం జనరిక్ మందులు ఉండాలి. తక్కువ ధరలకు విక్రయించాలి. అయితే బ్రాండెడ్ పేరిట నాసిరకం మందులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు వస్తుండడంతో గత నెల 23న ఏడుగురు సీనియర్ వైద్యుల బృందం తనిఖీ చేసింది. జనరిక్ మందులు 5 శాతం మాత్రమే ఉన్నాయని గుర్తించింది. ధరలు కూడా జన ఔషధి నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేస్తున్నట్టు తేలింది.

వైసీపీ హయాంలోనే అక్రమాలకు బీజం

2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు కాగానే టీటీడీలో అప్పటి కీలక వ్యక్తి సిఫారసుతో స్విమ్స్ ఓపీడీ బ్లాకులో రోగుల వెయిటింగ్ హాలును మందుల షాపుగా మార్చేశారు. అక్కడ పీఎంబీజేకే పథకం జన ఔషధి షాపు పెట్టారు. నెలవారీ అద్దె కేవలం రూ.20 వేలుగా నిర్ణయించారు. అక్కడ రోజువారీ వ్యాపారం రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల దాకా జరిగేది. నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ బ్రాండ్లుగా కంపెనీల పేర్లు చూపి అధిక ధరలకు నాసిరకం మందులు విక్రయించారన్న ఫిర్యాదులు వచ్చాయి. అయినా చర్యలు తీసుకోకపోగా ఏటా పది శాతం అద్దె పెంపుతో ఐదేళ్లు షాపును కొనసాగించారు. 2023 ఆగస్టులో సంబంధిత టీటీడీ కీలక వ్యక్తి పదవి నుంచి తప్పుకోబోయే ముందు ఈ షాప లైసెన్స్ గడువును 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2026 మార్చి 31వరకు ఏకంగా మూడేళ్ల పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇప్పించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గతేడాది డిసెంబరులో ఈ షాపు మూతపడింది. వైసీపీ కీలక నేత సిఫారసుతో ఈ షాపును బినామీ పేరుతో దక్కించుకున్న వ్యక్తి ఆ వెంటనే అదే నెలలో ఇన్నోవేటివ్ ఫార్మా పేరిట బ్రాండెడ్ మందుల షాపు ఏర్పాటు చేశారు. తర్వాత ఆరు నెలల వ్యవధిలోనే బినామీ పేరుతో జన ఔషధి షాపు తెరిచారు.

కీర్తి బ్రాండెడ్ షాపులో నాసిరకం మందులు

బర్డ్ ఆస్పత్రి భవనంలో కీర్తి మెడికల్ స్టోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో నడుస్తున్న బ్రాండెడ్ మందుల షాపు వ్యవహారం కూడా వివాదాస్పదంగా ఉంది. ఈ షాపు నెలవారీ అద్దె రూ.18 లక్షలు. స్వల్ప కాలంలోనే ఈ షాపుపై ఫిర్యాదులు రావడంతో స్విమ్స్, బర్డ్ ఉన్నతాధికారులు గత నెల 23న తనిఖీ చేశారు. బ్రాండెడ్ మందులకు బదులు జనరిక్ మందులే ఉండడాన్ని గుర్తించారు.వాటిని తొలగించి 90శాతం మందులు బ్రాండెడ్ మందులు ఉంచాలని ఆదేశించారు.దీనిపై గత 25న బర్డ్ ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినా టీటీడీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

తొలి తనిఖీలో వాస్తవాలుగా తేలిన ఆరోపణలు

ఫిర్యాదులు తరచూ వస్తుండడంతో స్విమ్స్ వైద్యుల బృందం ఈ ఏడాది ఏప్రిల్ 15న ఇన్నోవేటివ్ షాపులో తనిఖీలు చేపట్టారు. బ్రాండెడ్ కేటగిరీకి అనుమతి ఇవ్వగా 80 శాతం జనరిక్ మందులే ఉన్నట్టు గుర్తించారు. హై రిస్క్ మందులు, అత్యవసర మందులను విడివిడిగా నిల్వ చేయడం లేదని గుర్తించారు. గడువు సమీపిస్తున్న మందులను కూడా సాధారణ మందులతో పాటు కలిపే ఉంచుతున్నట్టు గమనించారు. ఈ లోపాలతో పాటు రూమ్ టెంపరేచర్ ప్రోబ్ కూడా పనిచేయడం లేదని వైద్యుల బృందం స్విమ్స్ ఉన్నతాధికారులకు నివేదిక అందజేసింది.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

● ఎస్‌డీజీఎం చేతననంద్ సింగ్



తిరుపతి రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల ప్రణాళికలు పరిశీలిస్తున్న ఎస్‌డీజీఎం చేతననంద్ సింగ్

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగవంతం చేయాలని దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ చేతననంద్ సింగ్ అధికారులను ఆదేశించారు. తిరుపతి పర్యటనలో భాగంగా శనివారం ఉదయం స్టేషన్ దక్షిణం వైపు జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. అభివృద్ధి ప్రణాళికలను పరిశీలించి, ప్రయాణికుల అవసరాల మేరకు పనులు ఉండేలా చూడాలని ఆదేశించారు. నూతన భవనాల్లో వ్యాపార పరమైన అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్ డాక్టర్ కె.చిన్నపరెడ్డి, డిప్యూటీ సీఈ వామనరావు, డి.ప్రభాకర్, మాధవరావు పాల్గొన్నారు.

సందడిగా కళాంగిని వేడుక

● ఐఐటీలో ఆర్ట్ వర్క్‌షాప్ విజయవంతం



పెయింటింగ్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఐఐటీ, ఐసర్ విద్యార్థులతో ఆర్టిస్టులు

ఏర్పేడు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీలో శనివారం ఆర్ట్ వర్క్‌షాప్ సందడిగా సాగింది. ఐఐటీకి చెందిన ఆర్టిస్టా.. ది ఆర్ట్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో తలపెట్టిన కళాంగిని వేడుక మొదటి రోజైన శనివారం ఉల్లాసభరితంగా సాగింది. ఐఐటీ, ఐసర్‌లకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తిరుపతికి చెందిన మహిళా ఆర్టిస్టులు రాగిమాను శ్రీదేవి, జి.గాయత్రి, బత్తుల అర్చన, ఎస్.లావణ్య పాల్గొని విద్యార్థులకు పెయింటింగ్‌లో మెలకువలు నేర్పించారు. ఫ్లోరల్, సీనరీ, పాట్ అడోర్మెంట్, పేపర్ డెకార్ తదితర అంశాల్లో సలహాలు, సూచనలు ఇచ్చారు. ఫ్యాకల్టీ అడ్వైజర్ పంచేటి జష్వవ్, ఆర్ట్ క్లబ్ హెడ్ ఆర్పా రుబీన్, మెంటార్ రోహన్ రతన్, క్లబ్ సభ్యులు బీఎస్ఎన్ కౌశిక్, రిషికేష్ రెడ్డి, సాత్విక్ పిల్యానం, హర్షవర్ధన్, రూబితా రంగనాథన్, సిద్ధార్థ గుంటూరు, నాగశ్వేత, శ్రీవర్షిని, రుతిక, మేఘ్ మెహతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జెండా ఉత్సవాలకు గూడూరు ముస్తాబు





గమ్మళ్లపాళెంలో విద్యుత్ దీపాలంకరణ

గూడూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణం ఆంజనేయస్వామి జెండా ఉత్సవాలకు ముస్తాబైంది. ఏటా విజయదశమికి ముందు వచ్చే అమావాస్య నాడు పట్టణంలో అంజనేయస్వామి జెండాలను ఊరేగించడం ఆనవాయితీ. పట్టణంలో సుమారు 40కి పైగా ప్రాంతాల్లో జెండా ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా గమళ్లపాళెం, మిట్టపాళెం, తూర్పువీధి, కర్ణాలవీధి, కోనేటిమిట్ట, మాళవ్యానగర్, ఐసీఎస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో భారీ విద్యుత్‌దీపాలతో వివిధ దేవుళ్ల కటౌట్లు ఏర్పాటు చేశారు. పట్టణంలోని వీధులన్నీ విద్యుద్దీపాలకరణతో శోభా యమానంగా మారాయి. ఆదివారం ఉదయం అంజనేయస్వామి జెండాలకు పూజలు నిర్వహించి వీధుల్లో ఊరేగిస్తారు. తరువాత ట్రాక్టర్‌పై ఉంచి ప్రత్యేకంగా అలంకరిస్తారు. రాత్రి ఈ గ్రామోత్సవంలో తప్పెట్లు, తాళాలు, జింగిరి మేళాలు, కాంతార, బేతాళ నృత్యాలు, కోలాటాలు, తెనాలిబ్యాండు, కేరళ వాయిద్యాలు నడుమ అంజనేయస్వామి జెండాలకు గ్రామోత్సవం జరుపుతారు.

ఐసర్‌లో ఎర్లీ కెరీర్ రీసెర్చ్ సింపోజియం

ఏర్పేడు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ అకడమిక్ సహకారాన్ని బలోపేతం చేయడమేగాక యువ పరిశోధకులకు వేదిక కల్పిస్తామని ఐసర్ ప్రతినిధులు చెప్పారు. మండలంలోని తిరుపతి ఐసర్ ఆధ్వర్యంలో తిరుపతి ఐఐటీ, జర్మనీ అకడమిక్ ఎక్స్ఛేంజ్ సర్వీస్‌తో పాటు బంగ్లాదేశ్, భూటాన్, భారత్, నేపాల్, శ్రీలంకలకు చెందిన డీఏఏడీ రీసెర్చ్ అంబాసిడర్ల నెట్‌వర్క్ సహకారంతో ఎర్లీ కెరీర్ రీసెర్చ్ సింపోజియం నిర్వహించారు. ఇంటిగ్రేటివ్ బయోసైన్సెస్ - డేటా డ్రివన్ డిస్కవరీ అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో బయాలజీ డేటా సైన్స్ రంగాల అనుసంధానంపై ప్రసంగాలు, చర్చలు జరిగాయి. వ్యక్తిగత వైద్య పద్ధతులు, వ్యాధి అంచనాలు, శాస్త్రీయ ఆవిష్కరణల్లో డేటా సైన్స్ పాత్రపై ప్రధానంగా దృష్టి పెట్టారు. బయోమెడికల్ ఇంజనీరింగ్ రంగంలో పరిశోధనలపై డాక్టర్ నాగరాజు గణపతి(ఐఐటీ హైదరాబాద్), డాక్టర్ శ్రేయా శ్రీనివాసన్(హార్వర్డ్ యూనివర్శిటీ) వివరించారు. ఔషధ ఆవిష్కరణలు, ట్రాన్స్‌లేషనల్ సైన్స్, మేధో సంపత్తి హక్కులపై డాక్టర్ అంబ్రిస్ సక్సేనా, డాక్టర్ రఘునాథ్, ఓ.రామభద్రన్ (తిరుపతి ఐసర్) చర్చించారు. మాలిక్యూలర్ బయాలజీ, డేటా మైనింగ్‌పై డాక్టర్ శృతి ఎస్ వెంబర్(ఐబీఏబీ, బెంగళూరు) ఉపన్యసించారు. తిరుపతి ఐసర్ ప్రతినిధి డాక్టర్ వసుధారాణి దేవనాథన్, తిరుపతి ఐఐటీ ప్రతినిధి డాక్టర్ పంచచారం మారియప్పన్, డీఏఏడీ రీసెర్చ్ అంబాసిడర్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అపోలో, ఎస్వీ, పద్మావతి మహిళా యూనివర్శిటీలు, తిరుపతి ఐఐటీ, ఐసర్ నుంచి వచ్చిన 200మందిపైగా విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. జర్మనీలో లభించే పరిశోధన అవకాశాలను డీఏఏడీ ప్రతినిధులు విద్యార్థులకు వివరించారు. ఐసర్ రిజిస్ట్రార్ ఇందర్‌ప్రీత్‌సింగ్ క్లోహీ, లెఫ్టినెంట్ కల్నల్ హిమాంశు శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇంట్లో దొంగల బీభత్సం

● కత్తులతో బెదిరించి దోపిడీ
● రూ.70వేల నగదు, 100 గ్రాముల బంగారు ఆభరణాల అపహరణ



దొంగలు చొరబడుతున్న సీసీ కెమెరా ఫుటేజ్

చంద్రగిరి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ కాశిపెంట్లలో శుక్రవారం రాత్రి దొంగలు బీభత్సం చేశారు. కత్తుల బెదిరించి దోపిడీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు .. గ్రామంలోని ఓ ఇంట్లో గల్లా నాగేశ్వరనాయుడు, భార్య సుశీల, ఆయన తల్లి ద్రౌపది ఉన్నారు. వీరి కుమారుడు ప్రశాంత్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి 9గంటలకు నాగేశ్వరనాయుడు దంపతులు తమ కుమారుడితో ఫోన్‌లో మాట్లాడుతున్నారు. ఇదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తుల కారులో ఇంటి ముందుకు వచ్చారు. గేటు ముందు హారన్ కొడుతుండటంతో సుశీలమ్మ వెళ్లి తలుపు తీసేందుకు ప్రయత్నిస్తుండగానే ఇంటి వెనుక వైపు నుంచి ముఖానికి మాస్కులు ధరించిన ముగ్గురు దుండగులు లోనికి ప్రవేశించారు. ద్రౌపది చేతులు తువ్వాలు కట్టేసి, నాగేశ్వరనాయుడు, సుశీలమ్మలకు కత్తులు చూపించి బెదిరించారు. కప్‌బోర్డులో ఉన్న రూ.70 వేల నగదు, వంద గ్రాముల బంగారు ఆభరణాలు తీసుకున్నారు. ఫోన్లో మాట్లాడుతున్న కుమారుడు ప్రశాంత్ ఇక్కడి అలజడిని గమనించాడు. దొంగలు పడ్డారని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి వెంటనే గ్రామంలో తెలిసిన కొందరికి ఫోన్ చేశాడు. గ్రామస్తులు చేరుకుని కేకలు వేస్తూ రావడంతో దొంగలు కారులో పరారయ్యారు. గ్రామస్తులు 100కి ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే హైవే మొబైల్ సిబ్బంది చేరుకుని దుండగులు కోసం గాలించారు. క్లూస్ టీమ్ వేలి ముద్రలు సేకరించింది. బాధితుడు నాగేశ్వరనాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వర్ణముఖి నదిలో వృద్ధుడి గల్లంతు



పాపయ్య (ఫైల్‌ఫొటో)

పెళ్లకూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి నది దాటుతూ ఓ వృద్ధుడు గల్లంతయిన ఘటన మండలంలోని చిల్లకూరు వడ్డిపాలెం గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చిల్లకూరు వడ్డిపాలెం గ్రామానికి చెందిన చమర్తి పాపయ్య (65) శనివారం సాయంత్రం గ్రామ సమీపంలోని స్వర్ణముఖి నది దాటే ప్రయత్నం చేశాడు. ఇటీవల తెలుగుగంగ జలాలను స్వర్ణముఖి నదికి వదలడంతో నీటి ప్రవాహం ఉధృతంగా ఉంది. ఆ విషయం తెలుసుకోలేకపోయిన పాపయ్య నదీ ప్రవాహానికి కొట్టుకుపోయాడు. చీకటి పడే వరకు స్థానికులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. చీకటిపడటంతో గాలింపు చర్యలు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆదివారం అగ్నిమాపకదళ సిబ్బందితో కలసి గాలింపు చర్యలు ముమ్మరం చేస్తామన్నారు.

ఈత సరదాకు బాలుడి మృతి

● మరొకరి గల్లంతు



షేక్ హారున్ మృతదేహం - గుణ (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఈత సరదాతో ఓ బాలుడు మృతిచెందాడు. మరో బాలుడు గల్లంతయ్యాడు. శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి తెలిపిన వివరాలు... పట్టణంలోని ఓటేరు కాలువ వీధికి చెందిన నాజర్ ప్రైవేటు పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కుమారుడు హారున్(8) ముత్యాలమ్మ గుడి వీధి పురపాలక సంఘ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. శ్రీకాళహస్తి పట్టణం దోబీఘాట్‌కి చెందిన గుణ(14) మరో నలుగురు పిల్లలతో కలిసి మొత్తం ఆరుగురు శనివారం సాయంత్రం స్వర్ణముఖి నదిలో ఈతకు వెళ్లారు. పట్టణంలోని దోబీఘాట్ సమీపంలో ఉన్న స్వర్ణముఖి నదిలో ఈత కొడుతుండగా హారున్, గుణ నీటి వేగంతో కొట్టుకు పోయారు. మిగతా నలుగురు పిల్లలు కేకలు వేయడంతో సమీపంలో ఓ పురపాలక సంఘ పారిశుధ్య కార్మికుడు అరుణ్ హారున్‌ను ఒడ్డుకు చేర్చాడు. చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గల్లంతైన గుణ కోసం గాలింపు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కబడ్డీ పోటీల్లో వెరిటాస్ ప్రతిభ



పాఠశాలకు చెందిన క్రీడాకారులను, కోచ్‌లను అభినందిస్తున్న చైర్మన్ శేషారెడ్డి

ములుగు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబరిచి రజత పతకాన్ని గెలుచుకున్నారని వెరిటాస్ సైనిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ బి. శేషారెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా ములుగు మండలం లక్ష్మక్కపల్లి పాఠశాలలో కబడ్డీ క్రీడాకారులను, కోచ్‌లు శంకర్, నరేశ్‌లను ఆయన సన్మానించి, అభినందించారు. బీహార్ రాష్ట్రం రోహతక్‌లోని నారాయణ్ వరల్డ్ స్కూల్‌లో ఈ నెల 13 నుంచి 17వరకు జాతీయ స్థాయి సీబీఎస్ఈ క్లస్టర్స్ అండర్-17 బాలుర కబడ్డీ పోటీలను నిర్వహించగా, తిరుపతి వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులు లీగ్ దశ నుంచి ఫైనల్‌కు చేరారు. శ్రీగురు హరికృష్ణన్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 45-52 పాయింట్స్‌తో వెనుకబడి రన్నర్స్‌గా నిలిచి రజత పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాట్లాడుతూ వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులు కబడ్డీలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని సీబీఎస్ఈ పాఠశాలల నుంచి ఇప్పటివరకు ఎవరూ సాధించని జాతీయ స్థాయి పతకాన్ని సాధించారని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ శ్రీకర్‌రెడ్డి, డీన్ సీజీహెచ్ ఖాన్, ప్రిన్సిపాల్ పీఆర్ఎస్ చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ యస్. నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

18మంది స్మగ్లర్ల అరెస్టు

● 16 ఎర్రచందనం దుంగల స్వాధీనం

మంగళం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ప్రొద్దుటూరు-జమ్మలమడుగు మార్గంలో శనివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి 18మంది స్మగ్లర్లను అరెస్టు చేసింది. 16 ఎర్రచందనం దుంగలు, రెండు కార్లు, గొడ్డళ్ల బరిసెలు, రంపపు చుట్టలు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కడప సబ్ కంట్రోల్‌కు చెందిన ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం శుక్రవారం రాత్రి ప్రొద్దుటూరు-జమ్మలమడుగు మార్గంలో వాహనాల తనిఖీ చేపట్టింది. తెల్లవారుజామున పెద్దశెట్టిపల్లి వద్ద రెండు కార్లు వేగంగా వస్తూ కనిపించాయి. పోలీసులను గమనించి వాహనాలు పక్కకు ఆపి దిగిపారిపోయే ప్రయత్నం చేశారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు వెంబడించి 18మందిని పట్టుకున్నారు. కార్లు తనిఖీ చేయగా 16 ఎర్రచందనం దుంగలు, నాలుగు పిడిలేని గొడ్డళ్లు, నాలుగు పిడిలేని బరిసెలు, రంపపు చుట్టలు దొరికాయి. స్మగ్లర్లతో పాటు వాటిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి, ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

జిల్లేళ్ల బాలాజీకి తమిళ సాహిత్య పురస్కారం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన రచయిత, అనువాదకుడు జిల్లేళ్ల బాలాజీకి తమిళ సాహిత్య పురస్కారం ప్రకటించారు. పడైప్పు అనే తమిళ సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఈ ఏడాది ప్రకటించిన ఐదు పురస్కారాల్లో ఇలక్కియ చుడర్ పురస్కారం బాలాజీని వరించింది. వివిధ సాహితీ ప్రక్రియల్లో విశేష కృషి చేసే రచయితలకు ఈ అవార్డులను ఇస్తారు. ఈ నెల 27న చెన్నైలో నిర్వహించే సభలో పురస్కారం అందజేస్తారు. అనువాదంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్న జిల్లేళ్ల బాలాజీ 130 కథలు రాశారు. 11 నవలలు, ఒక కవితా సంపుటి ప్రకటించారు. పలు కథలు నవలలు తమిళం నుంచి తెలుగులోకి అనువదించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి



విద్యుత్ దీపకాంతుల్లో చెంగాళమ్మ ఆలయం

దేవి నవరాత్రి ఉత్సవాలకు
చెంగాళమ్మ ఆలయం ముస్తాబు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయం నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. సోమవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు చెంగాళమ్మ ఆలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపకాంతులతో అలంకరించారు. 11 రోజులు అమ్మవారు రోజుకొక అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

మినీలారీ ఢీకొని మోటారు సైక్లిస్టు మృతి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలంలోని మూర్తిరెడ్డిపాళెం వద్ద జాతీయ రహదారిపై మోటారు సైకిల్‌ను మినీలారీ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. నాయుడుపేట పట్టణానికి చెందిన లక్ష్మణ్(35) ఓ ట్రాక్టర్ షోరూంలో విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం సాయంత్రం మోటారు సైకిల్‌పై మండలంలోని ఓ గ్రామానికి వెళ్లి వస్తుండగా మూర్తిరెడ్డిపాళెం వద్ద మినీలారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఆదిలక్ష్మి సంఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బీజేపీ నేత వాకాటి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ వాకాటి బుజ్జమ్మ

తడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి పుట్టినరోజు వేడుకలను ఆయన స్వగ్రామం చేనిగుంటలో శనివారం నిర్వహించారు. వాకాటి నారాయణరెడ్డి తల్లి చేనిగుంట సర్పంచ్ వాకాటి బుజ్జమ్మ చేతులమీదుగా కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. అలాగే రామాపురం సచివాలయం వద్ద సర్పంచ్ టీకే శ్రీనివాసన్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమాల్లో వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సెల్వం, టీడీపీ నాయకులు టీకే శ్రీనివాసన్, రవి, కళానిధి. గుణసుందరి, రామమూర్తి, వేనాటి గిరిరెడ్డి, కుమార్, బీజేపీ జిల్లా కార్యదర్శి రాచర్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సరళీకృత విద్యాబోధనకు ప్రణాళికలు సిద్ధం చేయండి

కోట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు పాఠశాలల్లో బోధించాల్సిన సరళీకృత విద్యపై దసరా సెలవుల్లో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని డీవైఈవో సనత్‌కుమార్ కోరారు. మండల పరిధిలోని చిట్టేడు, కోటలోని జిల్లా పరిషత్ బాలికలు, బాలుర ఉన్నత పాఠశాలల్లో శనివారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు జరిగాయి. ఆయా సమావేశాలను సనత్‌కుమార్ తనిఖీ చేశారు. విద్యాబోధన, సంతృప్తికర ఫలి తాలు సాధించి నియోజకవర్గంలోని పాఠశాలలను మొదటి స్థానంలో ఉంచాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఎంఈవో మస్తానయ్య, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగదు స్వాహాపై కేసు నమోదు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సురేష్ ప్రొడక్షన్స్ యాజమాన్యం నిర్వహణలో ఉన్న సినిమా హాళ్లకు సంబంధించిన నగదు స్వాహా చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. సురేష్ ప్రొడక్షన్స్‌లో పనిచేసే వెంకటసాయి సినిమా హాళ్లలో కలెక్షన్ నగదు రూ.12 లక్షలను తన సొంత అవసరాలకు వాడుకుని నకిలీ బిల్లులు సమర్పించాడు. ఈ విషయం తెలుసుకున్న ఆ సంస్థ మేనేజర్ ఫిర్యాదు చేయడంతో వెంకటసాయిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.

ఉన్నత పాఠశాలకు బీరువా వితరణ

కోట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వంజివాక ఉన్నత పాఠశాలకు రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటయ్య జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు బీరువాను వితరణగా ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగయ్య, వెంకటయ్య కుమార్తె కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే క్యాన్సర్ పరీక్షలు



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న కూటమి నేతలు

పెళ్లకూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 30 సంవత్సరాలు పైబడిన వారందరికి ఇంటి వద్దనే నోటి, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పెళ్లకూరు పీహెచ్‌సీ వైద్యులు సుజాతమ్మ, జితేంద్ర తెలిపారు. శనివారం మండలంలోని చిల్లకూరు సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, జీలపాటూరు సర్పంచు కందమూడి శివకుమార్, వైద్యులతో కలిసి ప్రారంభించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణ పొందిన వైద్య నిపుణులు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. తద్వారా క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడంతో పాటు అవసరమైన చికిత్స సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటశివారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శాంతి, బీజేపీ మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు, టీడీపీ నాయకులు సన్నారెడ్డి వేణురెడ్డి, ఏఎన్‌ఎంలు భూలక్ష్మి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్య సూత్రాలు పాటించాలి

కోట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ ఆరోగ్య సూత్రాలను పాటించి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని టీడీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు డాక్టర్ సారంగం రమేష్, వాకాడు ఏఎంసీ చైర్మన్ దారా ప్రమీలా అన్నారు. శనివారం ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని కోట దళితవాడలో స్వస్థనారి సశక్స్ పరివార్ అభియాన్ పథకంపై మహిళలకు అవగాహన కల్పించారు. స్థానిక వైద్యాధికారి డోన్‌ప్రియారావు, డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. అదే విధంగా కొక్కుపాడులో టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, జితేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి కోటేశ్వరరావు, ఎంపీటీసీ దారా సురేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీలో తేడాలొస్తే లైసెన్స్ రద్దు



డీలర్లతో మాట్లాడుతున్న ఏవో సుచ్చేంద్ర ప్రసాద్

కోట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎక్కడ ఎలాంటి లోపాలు జరగకుండా డీలర్లు రైతులకు ఎరువులను సరఫరా చేయాలని, తేడాలొస్తే సంబంధిత దుకాణ లైసెన్స్ రద్దు చేస్తామని మండల వ్యవసాయ అధికారి సుచ్చేంద్ర ప్రసాద్ హెచ్చరించారు. కోటలోని వ్యవసాయ కార్యాలయంలో శనివారం ఎరువుల దుకాణ డీలర్లతో యూరియా పంపిణీపై సమీక్ష నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ రాబోవు సీజన్‌కు సంబంధించి యూరియా కొరత లేకుండా అందుబాటులో ఉంచాలన్నారు. ఎకరా పొలానికి మూడు బస్తాల యూరియా విడతలవారీగా అందిస్తామన్నారు. సమావేశంలో వ్యవసాయ విస్తరణాధికారి సాయికుమార్, డీలర్లు పాల్గొన్నారు.

డీఎస్పీకి సన్మానం

నాయుడుపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ డీఎస్పీ బీవీ శ్రీనివాసులును తిరుపతి పార్లమెంటు తెలుగుయువత ఉపాధ్యక్షుడు పరసా రాజా సన్మానించారు. శనివారం డీఎస్పీ మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాది వాకాటి మల్లికార్జున్, మాజీ ఎంపీటీసీ అరుణ్, టీడీపీ నాయకులు భరణి, సుధాకర్, చంద్రశేఖర్, సుధీర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

గూడూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసింగరావుపేటలోని సిద్ధార్థ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ వినోద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో తలమంచి సిద్దారెడ్డి, డాక్టర్లు యామిని, లక్ష్మీసుధ, జనిత్‌రెడ్డి, స్వప్న పాల్గొన్నారు.

పరిశుభ్రత సామాజిక బాధ్యత

నాయుడుపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా చేపట్టడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నాయుడుపేట ఏఎంసీ ప్రాంగణంలో వైస్ చైర్మన్ కిలారి గోపి, డైరెక్టర్లు గిండి సతీష్, కేశవరెడ్డి, గోను బాబు తదితరులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. వర్షాకాలం కావడంతో పారిశుధ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు. నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణకుమారి ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో పరిసరాలను శుభ్రం చేశారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు భానుశెట్టి, శ్రీను, రోహిణి, సల్మా, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కల్యాణ్‌రెడ్డి



క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందిస్తున్న కల్యాణ్‌రెడ్డి

పెళ్లకూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆస్పత్రిలో చేర్పించి కేఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, టీడీపీ నాయకుడు వేలూరు కల్యాణ్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. శ్రీకాళహస్తి - సూళ్లూరుపేట మార్గంలోని సంత వేలూరు వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కింద పడి గాయాలపాలయ్యారు. అటువైపు వెళ్తున్న కల్యాణ్‌రెడ్డి క్షతగాత్రుడిని తన కారులో సూళ్లూరుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చి బంధువులకు సమాచారం అందించారు.

భాగవత కథల పుస్తకావిష్కరణ

గూడూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వరదానగర్‌లోని ఇంద్రసేనమ్మ నివాసంలో శనివారం శ్రీదేవి భాగవత కథల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయదుర్గాదేవి ఉపపీఠం నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ మాట్లాడుతూ పట్టణానికి చెందిన టీవీఎల్ ప్రసాద్ భాగవత కథలు అందరికీ అర్థమయ్యే రీతిలో సరళతరంగా రచించి ఇంద్రసేనమ్మ సహకారంతో ప్రచురించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శివకుమార్, డాక్టర్ రోహిణి, ఇంద్రసేనమ్మ, శ్రీకంటి రామమోహన్‌రావు, కోడూరు మీరారెడ్డి, ప్రజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

డక్కిలి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీవో రవీంద్రబాబు అన్నారు. శనివారం వెలికల్లు గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ గడ్డం చంద్రశేఖరరెడ్డి, సర్పంచ్ వెంకటరమణ, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.